హైదరాబాద్ వార్త





కూకట్‌పల్లిలో కురుస్తున్న వర్షం



కుత్బుల్లాపూర్‌లో కూలిన చెట్టు

# ఈదురుగాలులతో వడగళ్ల వాన

## నేలకొరిగిన చెట్లు, స్తంభాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త**

ఎండ వేడిమికి తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర ప్రజలకు వరుణుడు సాంత్వనపరిచాడు. ఆదివారం ఉదయం నుంచి ఎండలు దంచి కొట్టగా పలు ప్రాంతాల్లో అకస్మాత్తుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానపడింది. ఈ వర్షానికి పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కూకట్‌పల్లి, మూసాపేట, జేఎన్టీయూ, నిజాంపేట్, కేపిహెచ్‌బి, జీడిమెట్ల ప్రాంతాల్లో వడగళ్ల వాన కురిసింది. సుచిత్రా సర్కిల్, కొంపల్లి పరిసర ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. సికింద్రాబాద్, తిరుమలగిరి, అల్వాల్, మియాపూర్, చందానగర్, సూరారం, షాపూర్‌నగర్, బాలానగర్, బోయిన్‌పల్లి, దుండిగల్‌లోనూ వాన కురిసింది. ఎల్బీనగర్‌తోపాటు మీర్‌పేట్, కర్మాన్‌ఘాట్ పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ వర్షానికి కొన్ని చోట్ల వడగండ్లు ఇంట్లోకి సైతం వచ్చి పడ్డాయి. చింతల్‌లోని పద్మానగర్ లో ఈదురు గాలుల దాటికి భారీ వృక్షం నేలకూలింది. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి.భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



కుత్బుల్లాపూర్‌లో బండ్లపై కూలిన స్తంభం

# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్సీ

**తార్నాక, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో వికలాంగులపోరం ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల చట్టం–2016 అమలు దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని చెప్పారు.దివ్యాంగులకు రావలసిన హక్కులను అమలు దిశగా ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ హక్కుల నేతలు, నాయకులు డా. ఎస్.అశోక్ మాట్లాడుతూ చట్టం అమల్లోకి వచ్చి పది సంవత్సరాలు గడిచినా తమ జీవితాల్లో పెద్ద మార్పులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.విద్య, ఉద్యోగం, ఉపాధి రంగాల్లో సరైన అవకాశాలు కల్పించాలంటే చట్టాన్ని పూర్తిస్థాయిలో



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం, చిత్రంలో డా. అశోక్

సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో దివ్యాంగులకు నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణా పలు డిమాండ్లు వెల్లడించారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం, అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలు, జైపాల్ రెడ్డి పేరిట మిని విశ్వవిద్యాలయం ఏర్పాటు, ప్రతి జిల్లాకు నిధుల కేటాయింపు, ప్రైవేట్ రంగంలో శిక్షణ–ఉద్యోగ అవకాశాలు, పూర్తి సబ్సిడీ తో రుణాలు, అన్ని రంగాల్లో 5 రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. వికలాంగుల హక్కులను వారికి రావాల్సిన వాటాను అందించాలన్నారు. సమావేశానికి కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం, మొరిగాడి నరసింహాగౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు మొక్క ఉపేందర్, డాక్టర్ ఎన్ అశోక్, పరిశోధక విద్యార్థి, పల్స ఆంజనేయులుగౌడ్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి మారవేణి చంద్ర శేఖర్ యాదవ్, బుచ్చి రాములు వేణు గౌడ్, ధనమ్మ వెంకటేష్ జగన్, వెంకట్, రాజలక్ష్మి, గోలి ప్రభాకర్, మున్నా, వంశ రాజు రామచందర్, మరుగుజ్జు సంఘం ఉపాధ్యక్షులు సైదులు, పంది శ్రీను, ఉదయ్యు టీమ్, కోమరు మల్లు, పాండు యాదవ్, మాధవి, నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు, దివ్యాంగ సంఘాల నాయకులు హాజరయ్యారు.



గంజాయి విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

**ఉప్పల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** డిసిఈఓ మల్కాజిగిరి ఆదేశాల మేరకు ఏఇఎస్ మల్కాజిగిరి పర్యవేక్షణలో శనివారం సాయంత్రం నాచారం ఎక్సైజ్ సిబ్బందితో కలిసి ఎండు గంజాయి రవాణా చేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సిఐ ఓంకార్ కథనం ప్రకారం.. నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో ఎండు గంజాయి విక్రయిస్తున్నారని సమాచారంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. దీంతో నాచారం పరిసర ప్రాంతంలో అక్రమంగా ఎండు గంజాయి రవాణా మరియు అమ్ముతూ జరుపుతున్నారని సమాచారం మేరకు రూట్ వాచ్ నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నాగారం వర్షిత్‌కు చెందిన దారావత్ సంతోష్‌తోపాటు నేరేడ్‌మెట్‌కు చెందిన ఎస్. సందీప్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 1.200 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులు వైజాగ్ నుండి ఎండు గంజాయిని కొనుగోలుచేసి తెచ్చి అవసరమైన వారికి ఎక్కువ ధరలకు చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. ఉప్పల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. ఓంకార్, ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. నరేష్ రెడ్డి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నాచారం ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

**చార్మినార్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** పాతబస్తీ రికాబ్‌గంజ్‌లోని ఓ వస్త్రాల దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగి సంఘటన ఆదివారం చార్మినార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిది. ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు కథనం ప్రకారం....పాతబస్తీ రికాబ్‌గంజ్‌లో బద్రీ ప్రసాద్ విశాల్ జ్యోతి ప్రసాద్ టెక్స్‌టైల్స్ వస్త్రాల దుకాణంలో ఆదివారం సాయంత్రం ఆకస్మాత్తుగా మంటలు వచ్చాయి. మొగల్‌పుర ఫైర్ ఇంజన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. దీంతో ప్రమాదం తప్పింది. దుకాణంలో పాక్షికంగా బట్టలు కాలిపోయాయి.ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.ఈ కేసును చార్మినార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 440 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** మద్యం తాగి వాహనాలు నడిపే వారి పట్ల హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 440 కేసులు నమోదు చేశారు. రహదారి భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ఈనెల 17, 18 తేదీలలో(రెండు రోజుల పాటు) మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో మొత్తం 440 మంది వాహనదారులు మద్యం మత్తులో దొరికిపోయారు. వాహనాల వారీగా వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనాలు 376,త్రిచక్ర వాహనాలు 21,కార్లు,ఇతర వాహనాలు: 43 ఉన్నాయి. ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, రహదారి భద్రత దృష్ట్యా వాహనదారులు, ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ విభాగం అధికారులు కోరారు.

## కెపిహెచ్‌బిలో అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** కెపిహెచ్‌బి క్రైమ్ టీమ్ పూర్వం 54 కేసులలో నిందితుడుగా ఉన్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి దొంగ సొత్తు 8 సెల్‌ఫోన్లు, ఒక యాక్టివా స్కూటీనీ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. వాటి విలువ దాదాపు 3 లక్షల రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ జంషీద్ జమ్మి, హైదరాబాద్ కింగ్ కోటి ప్రాంతానికి చెందిన షేక్ ఖలీల్ కుమారుడు. షేక్ జంషీద్ అలియాస్ జమ్మి (44) గత కొన్ని సంవత్సరాలుగా రాత్రిపూట తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. అంతేకాకుండా నిందితుడు ఇంతకు ముందు హైదరాబాద్ నగరంలో మొత్తం 54 ఇంటి దొంగతనాల కేసుల్లో పాల్గొన్నట్టు రికార్డులు ఉన్నాయి. కెపిహెచ్‌బి క్రైమ్ టీమ్ సమర్థవంతమైన దర్యాప్తు ద్వారా నిందితుడిని పట్టుకుని, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

## జూబ్లీహిల్స్‌లో హోటల్‌లో కుళ్లిన మాంసం

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లోని ఒక ప్రముఖ హోటల్‌లో కుళ్లిన మాంసాహారం వడ్డించడంతో కంగుతిన్న కస్టమర్ పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్‌లోని తెలుగు మీడియం హోటల్‌కు వెళ్లిన ఒక కస్టమర్ మటన్ కూర ఆర్డర్ ఇచ్చారు. ఎంతో ఆశతో మటన్ నోట్లో పెట్టుకోగా అది కుళ్లిన వాసన వచ్చింది. దీంతో కంగుతిన్న కస్టమర్ హోటల్ నిర్వాహకులను నిలదీశాడు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఏం చేయలో తోచని అతను నేరుగా జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో హోటల్‌కు చేరుకున్న పోలీసులు హోటల్ మేనేజర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. అతన్ని విచారిస్తున్నారు. నాణ్యత లేని, నిల్వ ఉంచిన మాంసాన్ని ఎలా వడ్డిస్తారని పోలీసులు ప్రశ్నించారు. కాగా ఆయా మాంసాన్ని సీజ్ చేసి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసేందుకు హెచ్ ఫాస్ట్ విభాగానికి అప్పగించనున్నట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు.

# భవనాలు ఆకాశంలోకి.. జలాలు పాతాళంలోకి...

- ✱ గ్రేటర్‌లో ఏటా పెరుగుతున్న హైరైజ్ నిర్మాణాలు
- ✱ అడుగంటుతున్న భూగర్భ నీటి మట్టాలు
- ✱ ఇష్టారీతిన అనుమతులిస్తున్న యంత్రాంగం
- ✱ కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరం
- ✱ భూమిలోకి ఇంకని వర్షపు నీరు
- ✱ జూబ్లీహిల్స్, మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, ఎస్సార్‌నగర్‌లో అట్టడుగున



**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త**

గ్రేటర్ పరిధిలో హైరైజ్ భవనాల ఎత్తు పెరుగుతున్నకొద్దీ.. భూగర్భ జలాలు పాతాళానికి జారుతున్నాయి. వర్షపాతం సాధారణం కంటే 20 శాతం ఎక్కువే నమోదవుతున్నా ఆ స్థాయిలో భూమిలోకి నీరు చేరడంలేదు. చాలా అపార్ట్‌మెంట్‌లలో బోర్లు అడుగంటిపోతున్నాయి. పశ్చిమ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ సంక్షోభం మరింత తీవ్రంగా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం గ్రేటర్ పరిధిలో గతేడాది జనవరిలో 8.13 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. ఈ ఏడాది జనవరి నాటికి 9.46కు పడిపోయాయి. గతేడాది మార్చిలో 10.89 మీటర్ల లోతుకు చేరగా.. ఈ మార్చి నాటికి ఏకంగా 11.94 మీటర్ల లోతుకు పడిపోయాయి.

**హైరైజ్ అపార్ట్‌మెంట్‌లు.. గేటెడ్ కమ్యూనిటీలు**

–కాస్మోపాలిటన్ సంస్కృతి, పట్టణీకరణ, వలసలు, ఉద్యోగావకాశాలు,అభివృద్ధి, అంతర్జాతీయ మౌలిక వసతులు, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలు.. ఇలా రకరకాల కారణాలతో గ్రేటర్‌లో రియల్‌ఎస్టేట్ బూమ్ ఏర్పడింది. దీంతో హైరైజ్ అపార్ట్‌మెంట్‌లు, బడా గేటెడ్ కమ్యూనిటీలు కోకొల్లలుగా వెలుస్తున్నాయి.

–2018–2020 మధ్యకాలంలో జీహెచ్‌ఎంసీ పరిదిలో 17,538 భవన నిర్మాణ అనుమతులు మంజూరు కాగా.. గత నాలుగేళ్లలో వంద శాతానికి పైగా వృద్ధి నమోదైంది. భూగర్భ జలాల వినియోగం గురించి ఏ మాత్రం ఆలోచించకుండా అధికారులు ఇష్టారీతిన నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. దీంతో ఎస్సారనగర్, జూబ్లీహిల్స్, మాధాపూర్, గచ్చిబౌలి, కూకట్‌పల్లి, నానక్‌రాంగూడవంటి ప్రాంతాల్లో హైరైజ్ భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు నిర్మాణంలో ఉండటమే నీటి ఎద్దడికి ప్రధాన కారణం. ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గడంపై స్వయంగా జలమండలి ఎండి అశోక్‌రెడ్డి పేర్కొనడం గమనార్హం.

–నగరంలో దాదాపు 70 శాతం కొత్త ప్రాజెక్టులు ఈ ప్రాంతాల్లోనే నిర్మాణంలో ఉన్నాయి. డెవలపర్లు నిర్మాణం కోసం భూగర్భ జలాలపై ఆధారపడుతుంటారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత చాలా గేటెడ్ కమ్యూనిటీలు నీటిని ఆదా చేయడానికి వర్షపు నీటి సంరక్షణ ప్రాజెక్టులను సరైన రీతిలో నిర్వహణ చేయడంలేదు. ముందస్తు ప్రణాళికలు, ఇంకుడు గుంతలు వంటి సమగ్ర వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు డ్రైనేజీల నుంచి వృధాగా పోతోంది.

**శివార్లలోనూ ఇదే దుస్థితి...**

అపార్ట్‌మెంట్‌లలో ఇష్టారీతిన బోర్లు వేయడం, గేటెడ్ కమ్యూనిటీలలో నీటి వినియోగం పెరుగుతుండటంతో ఎద్దడి ఏర్పడుతోంది. మరోవైపు ఇంకుడుగుంతలు ఏర్పాటు,వినియోగం అంతంత మాత్రంగానే ఉండటంతో భూగర్భ మట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి.ఒకప్పటి శివారు ప్రాంతాలన్నీ ప్రస్తుతం నగరంలో అంతర్భాగమయ్యాయి పంట భూములన్నీ రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. చెరువులు, కుంటలు దాదాపు కనుమరుగయ్యాయి. ఒకటి రెండు ఉన్నా వాటి చుట్టూ భారీ నిర్మాణాలు, సీసీ రోడ్లే, పూర్తిగా కాంక్రీట్ జంగిలే.. ప్రతి 25 నుంచి 50 ఫీట్ల దూరంలో ఒక బోరు బావిని తవ్వుతుండటం, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ భూమిలోకి నీరు ఇంకకపోవడం చెరువులు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరూ లేకపోవడంతో భూగర్భంలోని నీరు పాతాళానికి పడిపోయింది ప్రధానంగా శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, బోడుప్పల్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంకర్‌పల్లి, చేవెళ్ల, మెయినాబాద్, కొత్తూరు, శంషాబాద్ రాజేంద్రనగర్, కందుకూరు మండలాల్లో భూగర్భ మట్టాలు బాగా పడిపోయాయి.

**ట్యాంకర్లే ఆధారం...**

ఎండిపోయిన బోరుబావులతో నగరవాసులు అల్లాడుతున్నారు. కొంతమంది పరిమిత స్థాయిలో సరఫరా అయ్యే వాటర్‌బోర్డు నీటితో సరిపెట్టుకుంటుంటే.. మరికొందరు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ వైపు మొగ్గు చూపిస్తుంటే.. ఇంకొందరు ప్రైవేట్ ట్యాంకర్లకు భారీ చార్జీలు చెల్లిస్తున్నారు. నగరంలో 48 వేల మంది నీటి కనెక్షన్‌దారులు ట్యాంకర్ సేవలను వినియోగిస్తున్నారని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం నగరంలో రోజుకు 11 వేల ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి. వేసవికాలంలో వంట చేయడం, స్నానం చేయడం, బట్టలు ఉతకడం ఇప్పుడు విలాసంగా మారిందని నార్సింగిలోని ఓ బడా గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వ్యాపారవేత్త అన్నారు. కమ్యూనిటీలో వర్షపు నీటి నిల్వ వ్యవస్థ పూర్తిగా ఎండిపోయిందని కొన్నిసార్లు తాగునీటి సరఫరా చాలా ప్రమాద కరంగా ఉందన్నారు.

## కేబుల్ బ్రిడ్జిపై నిలిచి ఉన్న వ్యక్తిని ఢీకొన్న బెంజ్ కారు

### చికిత్స పొందుతూ మృతి



శ్యామ్‌రాజ్ (ఫైల్‌ఫోటో)

**మాదాపూర్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కేబుల్ బ్రిడ్జిపై నిలిచి ఉన్న వ్యక్తిని అతివేగంగా వచ్చిన బెంజ్ కారు ఢీకొనడంతో ఆయన ప్రాణాలు కోల్పోయాడు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ కథనం ప్రకారం ఘట్‌కేసర్‌కు చెందిన శ్యామ్‌రాజ్(32) న్యూహాఫీజ్‌పేట్ అదిత్యనగర్‌లో నివసిస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 3.15 గంటల సమయంలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై నిలిచి వుండగా, జూబ్లీహిల్స్ నుంచి ఐకియా వైపు వెళ్తున్న బెంజ్ కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్యామ్ రాజ్‌ను స్థానికులు వెంటనే మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో ఆయన మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సహజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన కారు కోల్‌కత్తాకు చెందిన క్వాంటమ్ మినరల్స్ అండ్ మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నమోదు అయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం అనంతరం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ వెల్లడించారు.

## జలమండలికి మూడు పిఆర్‌ఎస్‌ఐ అవార్డులు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :**

జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతుంది. ఈయేడాది ఇప్పటికే పలు అవార్డులు గెలుచుకున్న జలమండలి తాజాగా మరో మూడింటిని తన ఖాతాలో వేసుకుంది. పిఆర్ ఎస్ఐ (పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా) తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ తెలంగాణ రైజింగ్ –2047 భాగంగా సొసైటీ నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో జలమండలికి మూడు బహుమతులు లభించాయి. ఓఆర్‌ఆర్ పరిధిలో భూగర్భ జలాల పెంపునకు అవగాహన కోసం బ్రోచర్ రూపొందించిన జలమండలి వివిధ మాధ్యమాల్లో ప్రజలకు అవగాహన కల్పించింది. దానికి మొదటి బహుమతి లభించింది. సివరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా జలమండలి చేపట్టిన 90 రోజులు స్పెషల్ డ్రైవ్ పైన రూపొందించిన డాక్యుమెంటరీకి కార్పొరేట్ వీడియో ప్రొడక్షన్ డెవలప్‌మెంట్ ఫీచర్ విభాగంలో ద్వితీయ బహుమతి లభించింది. అలాగే ఇంకుడు గుంతల నిర్మాణంపై సాంకేతిక సమాచారంతో వివరణాత్మకంగా రూపొందించిన పోస్టర్‌కు బెస్ట్ లేఅవుట్ డిజైన్ కేటగిరీలో ద్వితీయ బహుమతి లభించింది.

హైదరాబాద్ బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఆదివారం జరిగిన పిఆర్‌ఎస్‌ఐ తెలంగాణ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి కెవి రమణాచారి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిసి జలమండలి టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, పిఆర్ఓ సుభాష్, గ్రౌండ్ వాటర్ ఎక్స్పర్ట్ సత్యనారాయణకు ఈ అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎండి అశోక్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు.

# తగ్గుతున్న ఆర్టీసి బస్సులు..పెరుగుతున్న ప్రయాణికులు

## దొక్కు బస్సుల కొనసాగింపుతో పెరుగుతున్న ప్రమాదాలు.. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

**హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** ఆర్టీసి బస్సులో ప్రయాణం చేయడం ప్రమాదరహితం అంటూ ఆర్టీసి అనేక ప్రకటనలు చేస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయ డంలో మాత్రం సరైనా ఉత్సాహం చూపడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. సుఖప్రయాణం సంగతి పక్కన పెడితే డొక్కు బస్సులలో వందల సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించడం వల్ల బస్సులు అతి తక్కువ సమయంలోనే షెడ్డుకు చేరక తప్పడంలేదు. అంతేకాకుండా మెట్రోస్టేషన్ల నుంచి సమీప కాలనీలు, బస్తీలకు ఫీడర్‌సర్వీసులు నడుపుతామని గతంలో అధికారులు ప్రకటించినా ఇందుకు సంబంధించిన చర్యలు మాత్రం కనిపించడం లేదు. బస్సుల సంఖ్యను పెంచకపోవడంవల్ల ముఖ్యంగా నగర శివారు ప్రాంతాలలో ఆర్టీసి బస్సులలో ప్రయాణించేందుకు ఉత్సాహం చూపిస్తున్నప్పటికి ఆర్టీసీ మాత్రం బస్సులను ప్రయాణికులకు సరిపడా పెంచాల్సి ఉండగా అంతకంతకూ తగ్గిస్తూపోతోంది. దీంతో ప్రయాణికులు ప్రైవేట్‌వాహనాలపైనే ఆధార పడుతున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి అనేక ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్టీసి సరిపడా బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ఉదయం సాయంత్రం వేళల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో ఆయా ప్రాంతాల వారు గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అత్యధిక ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల బస్సుల నాణ్యత, జీవిత కాలం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

**నానాటికి తగ్గుతున్న ఆర్టీసి బస్సుల సంఖ్య...**

రోజురోజుకు గ్రేటర్ హైదరాబాద్ విస్తరిస్తుండడంతో ప్రయాణికుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. ఇందుకు సరిపడా బస్సులు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. పైగా బస్సుల సంఖ్య నానాటికి తగ్గిపోతోంది.



ఎనిమిది సంవత్స రాల కిందట మూడువేల ఎనిమిది వందల బస్సులు ఉండగా అనేక కారణాలవల్ల అవి కేవలం 3వేల లోపే ఉంది. బస్సుల సంఖ్య తగ్గడంతోపాటు బస్సు డిపోల సంఖ్యను అధికారులు తగ్గిస్తూపోతున్నారు. నగరంలో గతంలో డిపోల సంఖ్య 28 ఉండగా నేడు 25కు చేరుకున్నాయి. 2019 సంవత్సరంలో ఆర్టీసి అధికారులు పలుకారణాల చూపిస్తూ మూడు వేల ఎనిమిది వందల బస్సులు ఉండగా ఒక్కసారి గా వెయ్యి బస్సులను తగ్గించారు. దీంతో బస్సుల సంఖ్య 2800లకు చేరింది. ఈ రెండు, మూడు సంవత్సరాలలో అధికారులు రెండు వందల బస్సులు కొత్తగా సమకూర్చారు. ప్రస్తుతం కేవలం మూడు వేల బస్సులతోనే ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చుతున్నారు.

**శివారు ప్రాంతాల్లో తగ్గుతున్న ప్రయాణికుల సంఖ్య...**

నగర శివారు ప్రాంతాలలో నానాటికి ఆర్టీసి ప్రయాణికులు తగ్గుతున్నారు. ఆర్టీసి బస్సులు సరిపడా అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలపై ఆధారపడుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది.ఉదయం కార్యాలయాలకు, వ్యాపారాలు జరుపుకోడానికి, ఇతర పనుల కోసం నగర శివారు ప్రాంతాలకు చేరుకుంటారు. పనులు ముగిసిన అనంతరం సాయంత్రం సమయంలో వారివారి గమ్య స్థానాలకు చేరుకుంటారు. ఈ క్రమంలో ఉదయం, సాయంత్రం ఆర్టీసి బస్సులు సరిపడా అందుబాటులో లేని కారణంగా, కొన్నిసార్లు అందుబాటులో ఉన్నా కిక్కిరిన ప్రయాణికులు ఉండడంతో తప్పని సరి పరిస్థితిలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తు న్నారు. ఆల స్యంగా వచ్చే ఆర్టీసి బస్సుల కోసం ఎదురుచూసే సమయం లేకపోవడం, అత్యవసరంగా ప్రయాణించాల్సిన కారణంగా ప్రైవేట్ వాహ నాల్లో ప్రయాణం అనివార్యం అవుతోంది. దీంతో ప్రయాణికుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఎనిమిది సంవత్సరాల కిందటి వరకు ఆర్టీసి బస్సుల్లో దాదాపు 33 లక్షలకు పైగా ప్రయాణించేవారు నేడు కేవలం 20 లక్షలకు కాస్త అటూఇటుగా ప్రయాణిస్తున్నారు. కేవలం ఎనిమిది సంవత్సరాల కాలం లోనే 13 నుండి 14 లక్షల మంది ఆర్టీసి బస్సు ప్రయాణికులు తగ్గిపోయారు. ఎనిమది సంవత్స రాల కిందట ఉన్న జనాభా నిష్పత్తి బేరీజు వేస్తే దాదాపు 20 లక్షల మంది ప్రయాణికులు తగ్గినట్లుగా భావించవ్చని ప్రయాణికులే చెబుతున్నారు. పైగా కాలం చెల్లిన బస్సులకే మరమ్మతులు చేస్తూ రోడ్లపైకి తీసుకువస్తున్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి బస్సులను ఇలాగే కొనసాగిస్తే ప్రమాదాలు ఎదుర్కోక తప్పదని రావాణారంగా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**బస్సులు పెంచాల్సిన అవసరం...**

నగర శివారు ప్రాంతాల్లో అనేక కాలనీలు, బస్తీలు, వ్యాపార సంస్థలతో పాటు విద్యాసంస్థలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇందుకు తోడుగా జనాభా పెరిగిపోతోంది. అలాగే వారికి ప్రయాణ అవసరాలు వీపరీతంగా పెరిగిపోతోంది. వారి అవసరాలు తీర్చాలంటే ఆర్టీసి బస్సుల సంఖ్య గణనీయంగా పెరగా ల్సి న అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న బస్సులతో కాలం వెల్లదీస్తే కొన్ని నెలల్లోనే బస్సులు షెడ్డుకు చేరకతప్పదు. అధికారులు అత్యవసరంగా బస్సుల సంఖ్యను పెంచితే తప్ప ప్రజా రవాణా అవసరాలు తీరే పరిస్థితి లేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బస్సులకు తోడు మరో నాలుగైదు వేల బస్సులు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. అత్యవసరంగా కనీసం మరో మూడు వేల బస్సులను పెంచకపోతే రానున్న రోజుల్లో ప్రైవేట్ ప్రయాణ వ్యవస్థ ఆదిపత్యం కొనసాగక తప్పదని రవాణా రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్టీసి మనుగడకు ఇది అవసరమని అభిప్రాయపడుతున్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

## ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించడం అవసరం

**బిఆర్ఎస్ నేత ఎర్రబెల్లి సతీష్‌రావు**

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** ప్రపంచ లివర్ దినోత్స వం సందర్భంగా ఆదివారం ఏఎస్‌రావునగర్‌లో నిర్వహించిన లివర్ అవగా హన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రబెల్లి సతీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రావు మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించడం అత్యంత అవసరమన్నారు. లివర్ సంబంధిత వ్యాధులు విస్తరించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఆరోగ్యకర జీవనవిధానాన్ని అలవరచుకోవడం ద్వారా సమాజాన్ని ఆరోగ్య వంతంగా తీర్చిదిద్దుకోవచ్చని ఆయన వివరించారు. ప్రజా ఆరోగ్య పరిరక్షణ లో భాగంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో కీలకమని పేర్కొంటూ ప్రజలు తమ ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## బేడ బుడగ జంగాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న సిరిపాటి వేణు

**సైఫాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** అని న్నరంగాల్లో వెనుకబడి దుర్భర మైన దారిద్ర్య జీవితాన్ని గడుపుతున్న బేడ బుడగ జంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. అలాగే నామినేటేడ్ పదవుల్లోనూ అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బేడ బుడగ జంగాలు ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో బేడ బుడగ జంగాల జనాభాను తక్కువగా చూపించిందని, రాష్ట్రంలో 6 లక్షలకుపైగా ఉన్నామని, అనుబంధ కులాలతో కలిపితే 16 లక్షల మంది ఉన్నామన్నారు. ప్రభుత్వం రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిం చారు. తమ డిమాండ్ల సాధన కోసం త్వరలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రాజాపులేందర్, పడమంచి జగదీష్, దేవుడుకుమార్, కళ్యాణ్, విజయ్‌కుమార్, కళ్యాణ్‌రవి తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను మరవద్దు : ఎమ్మెల్యే


హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

**జీడిమెట్ల, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** ఎంత ఎదిగినా మన సంస్కృతి, సంప్రదాయాలను మరవవొద్దని బిఆర్ఎస్‌ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకా నంద్ అన్నారు. ఆదివారం 125 గాజుల రామారం డివిజన్ దేవేందర్ నగర్ పద్మావతి కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ ఎస్) 100 ఏళ్లను పూర్తిచేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళన నిర్వ హణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన "హిందూ సమ్మేళనం" కార్యక్రమా నికి వివేకానంద్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత ఆధునికతను అందిపుచ్చుకుంటూ మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తుతరాలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, యోగాధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హిందూ ధర్మ ప్రచారకులు బోధన్ ఉదయ్‌మహారాజ్ స్వామీజీ, తత్వస్కూల్ ఉపాధ్యాయురాలు హిమబిందు, జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మావుదూరి సూర్యనారాయణమూర్తి, అధ్యక్షులు మినుముల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింత శివరాజ్, కోశాధికారి దొమ్మాట ప్రభాకర్‌గౌడ్, సలహాదారులు పగిడి శంకర్‌రెడ్డి, సోమి రెడ్డి, టీ.వి.శ్రీను, కస్తూరి బాల్‌రాజ్, తెలంగాణ సాయి, వి.ప్రసాద్‌రెడ్డి, నారెడ్డి పూలమ్మ, యాదగిరి రెడ్డి, యాం సాగర్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు అడ్వకేట్ కమలాకర్, చెట్ల వెంకటేష్, నగేష్, సాయిబాబా, బోయిని మహేష్, శ్రవణ్, ప్రసాద్, శివా నాయక్ పాల్గొన్నారు.

## ప్రగతినగర్‌లో చలివేంద్రం ప్రారంభం

**నిజాంపేట్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** వేసవి కాలం దృష్ట్యా బాట సారుల దాహార్తిని తీర్చేందుకు కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం హైదరాబాద్ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతినగర్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తెలంగాణ కమ్మ సంఘాల సమైక్య అధ్యక్షులు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, టీపీసీసీ మాజీ జనరల్ సెక్రటరీ నర్సారెడ్డి భూపతి రెడ్డి, కమ్మ సేవా సమితి సభ్యులు, ప్రగతి నగర్ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## బిసి మహిళలకు అన్యాయం చేసిన మోడీ సర్కార్

**శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు అన్యాయం చేశారని మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్య క్షురాలు శంభుల ఉషశ్రీశ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం అంబర్‌పేట లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మోదీసర్కార్ మహిళా బిల్లును ప్రవేశ పెట్టి, ఓబిసి వర్గాలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. 146 కోట్ల జనాభాలో 48 ఓబిసిలకు అన్యాయం జరిగిందని చెప్పారు. "మహిళ బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తెచ్చారు. ఈ బిల్లు వెనక నియో జకవర్గాల పునర్విభజన దాగుంది. అందుకే ఈ బిల్లును ఇంత హడావిడిగా తీసుకువచ్చారు. డి లిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలను, ఈశాన్య రాష్ట్రాలను బలహీనంచేయడానికి మోదీ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ కుట్రపూరిత చర్యలకు చెక్ పెట్ట డానికి విపక్షనేత రాహుల్ గాంధీ, మిత్రపక్షాలు ఎన్డీఏ కూటమి ఈ మహిళా బిల్లును అడ్డుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళల పక్షపాతి" అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాం లోనే మొదటి ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ, రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్, లోక్‌సభ స్పీకర్ మీరాకుమారిలను నియ మించిన గొప్ప చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా అడు గులు వేస్తున్నారని చెప్పారు. బిజెపి ఒక్కసారైనా మహిళను జాతీయ అధ్యక్షురాలిని చేయలేదన్నారు. అన్నివర్గాలకు, ప్రత్యేకంగా మహిళలకు సమన్యాయం చేసే దిశగా సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, కేసి వేణుగోపాల్, రేవంత్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్, అల్కాలాంబ, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క, మా రాజకీయ గురువులు వి. హనుమంతరావు ఎల్లప్పుడు ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా సెక్రెటరీ స్వరూప, గోషామహల్ నియోజకవర్గం అధ్యక్షురాలు ఫర్జానా, డివిజన్ అధ్యక్షురాలు అయేషా బేగం, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్

# మహిళా బిల్లును వ్యతిరేకించడం దుర్మార్గం

**రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**

**సైఫాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లును ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకించడం దుర్మార్గమని, ఇది మహిళా వ్యతిరేక చర్యని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. 1996 నుంచి ఇప్పటి వరకు మహిళా బిల్లు 7 సార్లు తిరస్కరణకు గురికావడం దారుణమని, మన భారతీయ సమాజంలో లింగ వివక్ష, కుల వివక్ష ఉందని, ఈ రెండు వివక్షతలను తొలగించాలంటే ఒకదాని తరువాత మరొకటి తొల గించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కుల వివక్ష తొలగించాలంటే బిసిలకు రాజ్యాధికారంలో వాటా కల్పించాలని, ఇందుకోసం పార్లమెంట్‌లో బిసి బిల్లును పెట్టాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశామని, మహిళా బిల్లు పూర్తికాగానే బిసి బిల్లు పెట్టడానికి ప్రధాని అంగీకరించారని చెప్పారు. నిజా యితీ పరుడైన ప్రధాని నరేంద్రమోదీని విమర్శిం చడం మానుకోవాలని, దేశాన్ని ఒక్కొక్క మెట్టుగా ప్రపంచంలో అగ్రదేశంగా తీర్చిద్దిడానికి అడుగులు


మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

వేస్తున్నారని, మోదీని రాజకీయ కోణంలో చూడ రాదని, ఆయనకు ఇల్లు, ఊరు, కుటుంబం, ఆస్తిలే దని, దేశమే ఆయన కుటుంబమన్నారు. ప్రతి పౌరుడు సుఖంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటారని, అలాంటి ఆదర్శ నేత అయిన మోదీని సంకోచిత స్వార్థ రాజకీయాల కోసం విమర్శించడం తగదన్నారు. బిజెపి బిసివర్గానికి చెందిన మోదీని ప్రధాన మంత్రి గా మూడుసార్లు చేసిందని, ఆయన 27 మంది కేంద్ర మంత్రులను, నలుగురు బిసిలను గవర్నర్లుగా, ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిగా, ఒక దళితుడ్ని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా చేశారని ఆయన వివ రించారు. గతంలో ఏ రాజకీయ పార్టీయైన ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఇలా చేశాయా? అని ప్రశ్నించారు. దేశంలో 75 కోట్లకుపైగా ఉన్న బిసిల చిరకాల కోర్కె కులగణన డిమాండ్‌ను కే ంద్రం గౌరవించిందని, కులగణన తరువాత బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు, కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖ, జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, రంగాలలో రిజ ర్వేషన్‌లు పెంపు వంటి నిర్ణయాలను కేంద్రం తీసు కుంటుందన్నారు. సమావేశంలో బిసి నాయకులు సి.రాజేందర్‌ముదిరాజ్, అనంతయ్య, జిల్లపల్లి అంజీ, మోదీరాందేవ్, నిఖిల్ పటేల్ పాల్గొన్నారు.

## రాజకీయ అంటరానితనం పోవాలి

**మాజీ డిజిపి డాక్టర్ పూర్ణచంద్రరావు**

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** రాజకీయాల్లో సమాన ప్రాతి నిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, రాజకీయ అస్పృశ్యతకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందని రిటైర్డ్‌డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు అన్నారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన జాతీయ సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ, సమతా సోషియో ఎకనామిక్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ జిల్లా జడ్జి నిమ్మ నారాయణ, ఎన్. సుశీల, మల్లేశం, డాక్టర్ రమణనాయక్, పి.యాదగిరి తదితరులు ఈ సంద ర్భంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. డాక్టర్ పూర్ణచంద్రరావు మాట్లా డుతూ, దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నప్పటికీ అన్ని వర్గాలకు రాజకీయ అవకా శాలు సమానంగా లభించడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు రిజర్వేషన్లు ఉన్న ప్పటికీ, బీసీలు, మైనారిటీ లకు తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదన్నారు. అనేక కులాలు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకుండా ఉండటం ఆందోళనకరమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలం గాణ అసెంబ్లీలు, లోక్‌సభలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని ఆయన తెలి పారు. ఆది వాసీలు, దళితులు ఇంకా ప్రాథమిక సదుపాయాల విషయం లో వెనుక బడిన పరిస్థితుల్లోనే ఉన్నారని, అభివృద్ధి ప్రాజెక్టుల కారణంగా నిర్వాసి తులైన వారికి సరైన పునరావాసం కల్పించడంలో లోపాలు ఉన్నాయని విమ ర్శించారు. ప్రజాస్వామ్యంలో సమాన భాగస్వా మ్యంకోసం అన్ని వర్గాలకు చట్టసభల్లో తగిన ప్రాతి నిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. జనాభా శాతానికి అనుగుణంగా ప్రాతి నిధ్యం ఉండేలా చట్టపర మైన మార్పులు అవసరమ న్నారు. అంతర్జాతీయ ఉదాహరణలను ప్రస్తావిస్తూ, జర్మనీ, న్యూజిలాండ్, బెల్జియం, దక్షిణాఫ్రికా దేశా ల్లో అమలులో ఉన్న అనుపాత ప్రాతినిధ్య విధా నాలు చిన్న వర్గాలకు రాజకీయ స్థానం కల్పిస్తున్నా యని వివరించారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడం కాదు, పాలనలో ప్రతి వర్గం భాగ స్వామ్యం కావాలి అని ఆయన స్పష్టం చేశారు. ఈ సదస్సులో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గురుతేజ్ బహదూర్ సాహిబ్‌జీ జయంతి

**సికింద్రాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** సిక్కు మతానికి చెందిన తొమ్మిదవ గురువు శ్రీగురుతేజ్ బహదూర్ సాహిబ్‌జీ 405వ ప్రకాశ్ పురబ్ (జయంతి) వేడుకలు ఆదివారం సీతాఫల్‌మండిలో భక్తి, ఆనందం, ఆధ్యాత్మికత మధ్య ఘనంగా నిర్వహించారు. ధర్మరక్షణ కోసం త్యాగాలుచేసి, ప్రపంచానికి శాంతి, సామరస్య సందేశాన్ని అందించిన గురుతేగ్ బహదూర్ సాహిబ్‌జీ జయంతి సందర్భంగా సిక్కు భక్తులు విశేషంగా పాల్గొన్నారు. సికింద్రాబాద్ సీతాఫల్ మండిలోని గురుద్వారా శ్రీ గురుసింగ్ సభలో శ్రీ గురుగ్రంథ్ సాహిబ్‌జీకి ప్రార్థనలు అర్పిస్తూ వేడుకలు నిర్వహించారు. గురుద్వారా శ్రీ గురు సింగ్ సభ ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చిలకలగూడ, సీతాఫల్‌మండిలో నిర్వహించిన విశాల్ దీవాన్ (భారీ భక్తుల సమ్మేళనం)లో వందలాది మంది సిక్కు భక్తులు మరియు ఇతర మతాల ప్రజలు పాల్గొని ప్రార్థనలు చేశారు. ప్రముఖ రాగీ జథాలు గురుబాణి కీర్తనలు, కథలు (పవిత్ర గీతాలు) ద్వారా భక్తులను ఆధ్యాత్మికంగా అలరించారు. ప్రత్యేకంగా ఆహ్వానించ బడిన ప్రముఖ రాగీ జథాలు భాయ్ కుల్విందర్ సింగ్ ఖరార్ వాలే, కైషర్ భాయ్ సుఖ్బీర్ సింగ్, భాయ్ జస్కీరత్ సింగ్ తదితరులు గురుబాణి కీర్తనలు ఆలపిస్తూ, గురుబోధనలు వివరిస్తూ జీవన విలువలు, సామాజిక సామరస్యం పై సందేశం ఇచ్చారు. గురుతేగ్ బహదూర్ సాహిబ్‌జీ బోధనలు నేటి సమా జానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. అలాగే సిక్కు గురువులు దేశ ఐక్యత, శాంతి, సోదరభావం, మానవత్వాన్ని ప్రోత్సహించిన విధానాన్ని వివరించారు. భక్తులు గురుబోధనలను అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సంప్రదాయ గురు కా లంగర్" (ఉచిత భోజన సేవ)ను అందరికీ ఏర్పాటు చేశారు. భక్తులు ఒకే వరుసలో కూర్చొని భోజనం చేయడం ద్వారా ఐక్యత, సోదరభావం, మానవతా విలువలను ప్రతిబింబించారు. మాస్ కాన్గ్రిగేషన్‌కు విచ్చేసిన భక్తులను ప్రబంధక్ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.


కీర్తనలు ఆలపిస్తున్న దృశ్యం

## రెడిమిక్స్ ప్లాంట్ తొలగించాలి

**బిఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**నార్సింగి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** కాలుష్య నియంత్రణ మండలి నిబం ధనలు ఉల్లంఘించి, జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన రెడిమిక్స్ ప్లాంట్‌ను తొలగించాలని మణికొండ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ మణికొండ సర్వే నెంబర్ 65.లోఉన్న ఎకరం 30.గుంటల ప్రభుత్వ భూమిని సమగ్ర మార్కెట్ కోసం కేటాయించినప్పటికి గత పాలకవర్గం అలసత్వం వలన అది సాధ్య పడలేదని తెలిపారు. ప్రస్తుతం కోట్ల విలువైన ఈ భూమిలో ఓ కాంట్రాక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసుకొని వినియోగించుకుంటున్నా అధికారగణం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగిం చాల్సిన ప్రభుత్వ భూమిలో ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ తిష్ట వేసినా అధికారులు మిన్నకుండా ఉండడం దారుణమన్నారు. దీనిపక్కనే ఏర్పాటు చేసిన రెడిమిక్స్ ప్లాంట్ వలన నిత్యం పెద్ద మొత్తంలో దుమ్ము,ధూళి వెలువడుతుందని, వాతావరణం కలుషతం అయ్యి పిల్లలు, వృద్దులు రోగాల పాలవుతున్నారని వివరించారు. ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించే వాహనదారులు నిత్యం నరకయాతన పడుతున్నారన్నారు. ప్రజల ప్రాణాలకు కంటకంగా మారిన రెడిమిక్స్ ప్లాంట్‌ను అధికారగణం స్పందించి వెంటనే తొలగించాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ప్రతిపాదిత ఎస్‌టిపి ఎత్తైన ప్రదేశంలో ఉండడ వలన డ్రైన్ ఛానల్ స్థాయి నిరుపయోగకరంగా కనిపిస్తుందన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నామన్నారు. పంచవటి కాలనీ రోడ్ నెంబర్-10లో వచ్చే వరద నీటితో స్థానికులు ప్రతీ వర్షాకాలంలో నరకయాతన పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనుభవరాహిత్యం కలిగిన వారితో పనులు చేయించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, లక్ష్మణ్ రావ్, భానుచందర్, శ్రీధర్, సుమనలిని, రాజేంద్రప్రసాద్, రమణమూర్తి, మంజూ, దేవిప్రియ, కిరణ్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 11 నుంచి 12.30 గంటలు వరకు అలియాబాద్, షంషేర్‌గంజ్, ఇంజన్‌బౌలి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు తెలిపారు.

## బిఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభా వేదికను సందర్శించిన తలసాని

**కంటోన్మెంట్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ జగిత్యాలలో సోమవారం తలపెట్టనున్న ప్రజా అశీర్వాద సభ వేదికను ఆదివారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, కంటోన్మెంట్ తెలంగాణ ఉద్యమ నేత గజ్జల నాగేశ్, గుర్రం పవన్ తదితరులు సందర్శించారు.

## డాక్టర్ రమణాచారికి నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పురస్కారం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాతవార్త) :** విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ఈ ఏడాది "మహాకవి డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య స్మారక సాహిత్య పురస్కారంకు ఎంపికయ్యారు. ఈ మేరకు "నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం అధ్యక్షులు కె. సాగరరావు, సభ్యులు నండూరి గోవిందరాజు, డాక్టర్ నండూరి విద్యారణ్య స్వామి, సమితి అధినేత వేమరాజు విజయ్ కుమార్ వెల్లడించారు. నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం, నవ్య సాహితీ సమితి సంయుక్తాధ్వర్యం లో 26 న సాయంత్రం 6 గంటలకు సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో మహాకవి నండూరి 106వ జయంతి సభ సంద ర్భంగా రమణాచారికి పురస్కార ప్రదానం చేయనున్నారు. ఆదివారం చిక్కడ పల్లిలోని నవ్య సాహితీ సమితి కార్యాలయంలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సభలో రాష్ట్ర ఖజానా శాఖ ఉప సంచాలకురాలు జి. వసుంధర, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ ఆర్. అనంత పద్మనాభరావు, ఆచార్య టి. గౌరీశంకర్, ఆత్మకూరి గాంధీ గౌరవ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాహిత్య పీఠం కార్యదర్శి డాక్టర్ ఆచార్య ఫణీంద్ర కోరారు. పోస్టర్ ఆవిష్కరణ సభలో పీఆర్వో బాలాజీ శర్మ తదితరులు పాల్గొన్నారు.


సాహిత్య పురస్కార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

# 1977 గోరక్షా చట్టాన్ని కఠినంగా అమలుపరచాలి

**విశ్వహిందూ పరిషత్ గోరక్షా విభాగం, న్యాయ సలహా విభాగం డిమాండ్**

**ముషీరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** 1977 గోరక్షా చట్టాన్ని కఠినంగా అమలుపరచాలని విశ్వ హిందూ పరిషత్ గోరక్షా విభాగం, విశ్వహిందూ పరిషత్ న్యాయ సలహా విభాగం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని గో శాలలో తెలంగాణ విశ్వహిందూ పరిషత్ గోరక్ష ప్రాంత ప్రముఖ్ ఎం.సుభాష్‌చందర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంకు విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత కార్యదర్శి పరాయితం లక్ష్మీ నారాయణ, కేంద్రీయ సంయుక్త కార్యదర్శి గోరక్ష సహ ప్రముఖ్ ఆకారపు కేశవరాజు, విధి ప్రకోష్ట భాగ్యనగర్ క్షేత్ర ప్రముఖ్ బోయినిపల్లి శివప్రసాద్, న్యాయవాద పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సం సాని సునీల్, సీనియర్ న్యాయవాది బ్రహ్మదండి రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోరక్షా చట్టం తెలంగాణలో సరియైన పద్ధతిలో అమలుపరచటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నడిపే ప్రభుత్వ యంత్రాంగం అసమర్థత కారణంగా గోవులు ఘోరమైన బాధలు పడుతున్నాయని, వందలాది ఆవులను వాహనాల లో కుక్కి కుక్కి హింసించి చంపుతున్నారని ఆరోపిం చారు. పోలీస్ యంత్రాంగం తమ విధులను సరైన పద్ధతితో నిర్వర్తించని కారణంగా గో భక్తులు ధర్మ



మాట్లాడుతున్న గోరక్ష సహప్రముఖ్ కేశవరాజు

నిష్ట కలిగినవారు చట్టాన్ని రక్షించటం కోసం రోడ్డు పైకి వస్తున్నారని గుర్తుచేశారు. గోవులను హింసి స్తున్న వారికి సహకరిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా కళ్లు తెరిచి, గోరక్షా చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యం త్రాంగం ఇప్పటికీ గో రక్షణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే, గోహత్యా పాతకం అందరికీ కలుగుతుం దని హెచ్చరించారు. గోహత్యకు సహకరిస్తున్న వారి వంశాలు నిర్వంశాలు అవుతాయని, ఏడు తరాల పాటు ఆ పాపం వెంటాడుతుందని పీఠాధిపతులు శపిస్తున్నారని పేర్కొన్నారు. నేడు ఆవులు ధర్మం కోసం, న్యాయం కోసం పరితపిస్తున్నాయని, అటు వంటి ఆవుల రక్షణ కోసం ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించబోతున్నామని తెలి పారు. గ్రామగ్రామాన సర్పంచులను, వీఏఓలను కలిసి, గోరక్షాచట్టాన్ని అమలుపరచమని వినతిపత్రాలు అంద చేస్తున్నామని, పోలీస్‌శాఖను, ప్రభుత్వ యంత్రాం గాన్ని కూడా కోరబోతున్నామని వివరించారు.


మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

## బాగ్‌అంబర్‌పేటలో ఉచిత వైద్య శిబిరం

**హైదరాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ మెరుగుపడితేనే మానవ మనుగడ కొనసాగుతుందని బీజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎన్.గౌతమ్‌రావు అన్నారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేటలో సీసన్స్ హాస్పిటల్స్ నిర్వహించిన ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని గౌతమ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ అనేది మానవుని ప్రాథమిక హక్కులని, ఆ హక్కును గుర్తించి ప్రైవేట్ ఆసుపత్రి ఉచిత మెగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం అభినంద నీయం అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజాలను నిర్మించడం కోసం ఉచిత మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించడం ప్రసంశనీయం అన్నారు. సీసన్స్ హాస్పిటల్స్ ఛైర్మన్ డా.జి.హరిచరణ్ మాట్లాడుతూ హాస్పిటల్ వైద్య బృందంలో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, పీడియాట్రిక్స్ వంటి విభాగాల నిపుణులు ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించారని తెలిపారు. హాస్పిటల్ డైరెక్టర్ డా.దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ విస్తృతమైన కార్డియాక్ స్క్రీనింగ్ తోపాటు బిపి, షుగర్, లిపిడ్ ప్రొఫైల్, బోన్ డెన్సిటీ, హెచ్.బి టెస్ట్, ఈసీజీ, డిఏం న్యూరోపతి, డియాబెటిక్ ఫుట్ చెక్, కంటి పరీక్షలతోపాటు హెచ్.బి ఏ1సి వంటి పరీక్షలను ఉచితంగా చేశామని తెలిపారు. డా.రఘునాథరావు ఆహారం, వ్యాయామం, బరువు నియంత్రణకు సంబంధించిన అంశాలపై అవగాహనా కల్పించారు.

## కాఫీ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** కాఫీ షాపుల్లో నిఘానేత్రాల నిరంతర నిఘా ఉండాలని హైకోర్టు ఆదేశించింది. నిబంధనలు పాటించని వాటిపై పోలీసులు చర్యలు తీసుకోవచ్చని కోర్టు స్పష్టం చేసింది. బంజారా హిల్స్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న లూసిఫర్ బై హెచ్‌పీ కాఫీ లాంజ్‌పై స్థానిక పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టేసింది. ఈ సందర్భంలో న్యాయస్థానం కాఫీషాపులు, హుక్కా కేంద్రాల వ్యవహారం లో కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. కాఫీ లాంజ్‌లో నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, 21 ఏళ్లు నిండిన వారిని మాత్రమే తమ దుకాణాలలోకి అనుమతించాలని స్పష్టం చేసింది. లూసిఫర్ బై హెచ్‌పీపై ఫిబ్రవరిలో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదుచేయగా కోర్టు ఇప్పటికే కొట్టేసింది. తాజాగా బంజారాహిల్స్ పోలీసులు అదే షాపుకు చెందిన మరో శాఖపై దాడి చేసి కేసు నమోదు చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును లూసిఫర్ యజమాని లేఖరాజ్‌యాదవ్ హైకోర్టులో సవాల్ చేయగా, న్యాయస్థానం ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేసింది. కోట్పా యాక్ట్‌లోని నిబంధనల్ని పిటిషనర్ ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు కాఫీ లాంజ్ నిర్వహించడానికి అనుమతినిస్తూ ఆదేశించింది.

## టిపిసిసి ప్రొటోకాల్ కోఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్‌గా బొంగునూరి కిషోర్‌రెడ్డి

**దుండిగల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఏఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షినటరాజన్ ఆదేశాల మేరకు, రాష్ట్ర ప్రోటోకాల్ ఛైర్మన్ హెచ్ వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డిని ప్రోటోకాల్ కోఆర్డినేషన్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమించారు. ఈ నియామకానికి సంబంధించి కిషోర్ రెడ్డి స్పందిస్తూ, తనపై నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు.

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేనప్రచారం

**కంటోన్మెంట్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** ఈ నెల 23న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో జరగనున్న నేపథ్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తమిళనాడులోని మదురై జిల్లా మెలూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, కాంచిపురం ఎంపీ,విశ్వనాథ్ పెరుమాల్‌లు పాల్గొన్నారు.

## రామ్‌మందిరం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** స్థానిక బస్తీ సమస్యల పరిష్కారం ధ్యేయంగా గౌలిగూడ రామ్‌మందిరం వెల్ఫేర్ అసోసియేషన్ పని చేస్తుం దని నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన వి.కిషన్‌యాదవ్, అధ్యక్షులు ఎం.రవి యాదవ్ తెలిపారు. ఆదివారం గౌలిగూడ రామ్ మందిరం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా బాలకిషన్, పి.రమేష్‌బాబు, ఉపాధ్యక్షులుగా వి.మహేష్‌గౌడ్, ఆర్.రాజ్ కుమార్, డి.అరవింద్‌యాదవ్, ఎం.సంతోష్‌చారి, రవీందర్‌రాజ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా వి.సాయిరాంయాదవ్, జి.అశోక్‌గౌడ్, కోశాధికారి ఎన్.గణేష్‌వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా టిల్లుయాదవ్, ఎన్.శ్రీనివాస్, వై.సాయికుమార్, అమృత్‌రావు, ఏ.రాజశేఖర్, జాయిన్ సెక్రటరీలుగా జి.శంకర్‌గౌడ్, బి.సునీల్, ఎన్.శ్రీకాంత్, డి.గణేష్, కిరణ్‌కుమార్, సలహా దారులుగా వై.కృష్ణ, ఆనంద్‌కుమార్‌గౌడ్, రాకేష్‌జైస్వాల్, ఎం.మహేష్ వర్మ, రవీందర్, ఎన్.శ్రీకాంత్, లీగల్ అడ్వైజర్లుగా పి.నిత్యానంద్‌యాదవ్, వి.నిషితగౌడ్, కె.శ్రీనివాసులను నియమించడం జరిగిందని చైర్మన్ వి.కిషన్‌యాదవ్ తెలిపారు.

## చెరువులో దూకిన యువతి.. కాపాడిన కూకట్‌పల్లి

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పోలీసులు అప్రమత్తంగా స్పందించి ఓ యువతి ప్రాణాన్ని కాపాడారు. కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన యాదగిరి కూతురు రియా (20) డిప్లొమా విద్యార్థిని ప్రస్తుతం ఆమె షణ్ముఖ్ హాస్టల్, రోడ్ నెం.3, కెపిహెచ్‌బిలో నివాసం ఉంటుంది. ఆమె స్వస్థలం కల్వకుర్తి, తెలంగాణ రాష్ట్రం. వ్యక్తిగత సమస్యల కారణంగా ఆమె ఆత్మహత్యకు పాల్పడేఉద్దేశంతో ఆదివారం ఐడీఎల్ సరస్సు వద్దకు వెళ్లింది. ఇదిగమనించిన స్థానికులు డయల్100 ద్వారా సమాచారం అందుకున్న వెంటనే కూకట్‌పల్లి పోలీసులు ఆలస్యం చేయకుండా ఘటనా స్థలికి చేరుకున్నారు. ఎస్ఐ చంద్రశేఖర్, ఎస్ఐ దీక్షిత, పెట్రోల్ కార్ డ్రైవర్ హెచ్‌జీ 1130 వెంకటప్ప తక్షణమే స్పందించి యువతిని గుర్తించారు. అప్పటికే ఆమె సరస్సు మధ్యలో ఉండగా పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించి ధైర్యసాహసాలతో సరస్సులోకి ప్రవేశించి ఆమెను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం యువతికి కౌన్సెలింగ్ నిర్వహించి సురక్షి త ప్రదేశానికి తరలించారు. ప్రస్తుతం ఆమె తన ఆత్మహత్యాయత్నా నికిగల కారణాలను వెల్లడించేందుకు ఇష్టపడటం లేదు. సైబరాబాద్ పోలీ సులు మరోసారి ప్రజల ప్రాణరక్షణలో తమ నిబద్ధతను వేగవంతమైన స్పందనను మానవతా దృక్పథాన్ని చాటిచెప్పారనీ స్థానికులు ప్రశంసిస్తున్నారు.

## ఫుడ్‌కోర్టులో స్వల్ప అగ్ని ప్రమాదం

**మంటలు ఆర్పివేసిన అగ్నిమాపక శకటం**

**బేగంపేట ఏప్రిల్ 19,ప్రభాతవార్త :** బేగంపేట ప్రకాశంనగర్ పరిధిలోని ఓ హోటల్‌లో ఆదివారం మధ్యాహ్నం సమయంలో కట్టెల పొయ్యి నుంచి భారీగా ఎగసిన పడిన మంటలతో హోటల్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం సంభ వించింది. అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం నగర్‌లో ఎవర్‌గ్రీన్ రెస్టారెంట్, ఫుడ్‌కోర్టులో ఇటీవల కాలంలో గ్యాస్ కష్టాల తో కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఈ క్రమంలో పొయ్యి నుంచి మంటలు భారీగా ఎగసి పడటంతో పక్కనున్న సామాన్లకు అంటుకున్నాయి. దట్టమైన పొగతోపాటు మంటలు వ్యాపించడం గమనించిన సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో పాటు బేగంపేట పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది, హైడ్రా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను వెంటనే ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నివాసాలకు ఆనుకుని ఉన్న ఈ హోటల్‌లో మంటలు మరింతగా వ్యాపించి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. అయితే సకాలంలో స్పందించడంతో స్వల్పనష్టం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.



ఏక్తా యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బిజెపి నేత రామక్రిష్ణ తదితరులు

## ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి : రామక్రిష్ణ

**కంటోన్మెంట్, ఏప్రిల్ 20 ప్రభాతవార్త:** సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి హిందూవాది రాజకీయ పార్టీలకు అతీతంగా మే 12న నిర్వహించ తలపెట్టనున్న హన్‌మాన్ జన్మోత్సవ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జె.రామక్రిష్ణ తెలిపారు. ఆదివారం మహేంద్రహిల్స్‌లో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 12వ తేదీన చేపట్టనున్న హన్‌మాన్ జన్మోత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున ఏక్తాయాత్ర పేరుతో నిర్వహించే శోభయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి హిందూవాది పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖాకగూడ, హన్‌మాన్ దేవాలయం, వేద పండితులు హేమంత్‌శర్మ, బిజెపి నాయకులు సతీష్ కుమార్, విజయ్‌యాదవ్, నాగభూషణ్‌రెడ్డి, వీర వర్ధన్ గౌడ్, అనీల్,శాలిని తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి నగర ఉపాధ్యక్షురాలిగా శివాని



శివానికి నియమకపత్రం అందచేస్తున్న రాజు ఉస్తాద్ తదితరులు

**ముషీరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి నగర ఉపాధ్యక్షురాలిగా ఎం.శివాని నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు రాజు ఉస్తాద్, ఆమెకు నియామకపత్రం అందచేశారు. ఈసందర్భంగా రాజు ఉస్తాద్ మాట్లాడుతూ దళితుల హక్కుల కోసం శక్తివంచన లేకుండా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యక్షురాలిగా నియమితులైన శివాని మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు మచ్చ విజయ్‌కుమార్, సుదర్శన్, సత్యనారాయణ, పిట్ల వెంకటేష్, నవీన్, మద్దెల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా సాగిన అమ్మవారి కళ్యాణం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాతవార్త) :** చిక్కడపల్లి బాపూజీనగర్‌లో రాజరాజేశ్వరి అమ్మవారి 42వ వార్షికోత్సవాలు బాపూజీ సేవక్ సమాజ్ ఆధ్వర్యంలో శివశ్రీ ఆనంద్‌స్వామి పర్యవేక్షణలో ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మాజీ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల కళ్యాణ మహోత్సవంలో ఆమె పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా పూజారులు మాజీ కార్పొరేటర్ దంపతులను ఘనంగా సన్మానించి, వేదాశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్‌కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, ఆనంద్‌రావు, సాయికుమార్ పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం అభినందనీయం

### బిజెపి మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాతవార్త) :** సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, వారి సేవలను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం పద్మా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో గాయత్రీ మహిళా వాకర్స్ క్లబ్, హ్యాపీ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బిజెపి పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాతిరి పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి భరత్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై చీరలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో చాతిరి పార్థసారథి, కాలనీ సెక్రటరీ ప్రకాష్, రామలింగేశ్వర్‌రావు, మంగళ, బాబు, కె.హర్ష, మాధవ్‌రెడ్డి, జ్యోతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో రాజకీయాలకు తావులేదు

**బాగ్‌లింగంపల్లి, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** సామాజిక సేవలో రాజకీయాలకు తావులేదని టీపీసీసీ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ ఛైర్మన్ రాజేష్‌కుమార్ అగర్వాల్ రూపించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులోని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.మనోహర్ రెడ్డి సమక్షంలో సభ్యుల సౌకర్యార్థం తాను ఇచ్చిన హామీ మేరకు 50 కుర్చీలు, 4 టేబుళ్లను క్లబ్ అధ్యక్షుడు ఎస్.మనోహర్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, వాకర్ల సంక్షేమానికి రాజేష్ కుమార్ అగర్వాల్ స్వచ్ఛమైన సేవా దృక్పథంతో ఈ విరాళం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు సంపత్ రెడ్డి, లక్ష్మణ్‌వర్మ, నవ్వ రాజు, రఘువీర్, రాములు, శ్రీను పాల్గొన్నారు.

## సుందరయ్య పార్క్‌లో రక్తదాన శిబిరం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 19 (ప్రభాతవార్త) :** వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్.మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదానశిబిరాన్ని నిర్వహించారు. పీవీ నరసింహారావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షుడు ఎస్. మనోహర్‌రెడ్డి, కార్యదర్శి ఎం.దశరథ్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో పలువురు ప్రముఖులు పాల్గొని రక్తదాతలను అభినందించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ బి.గంగాధర్‌రెడ్డి, ఎస్.మురళీకృష్ణ, నాగభూషణం, సంపత్‌రెడ్డి, శైలజామోహన్, ఎస్.రమేష్‌రెడ్డి, పి.వి.నిరంజన్‌రెడ్డి, ఆర్.వివేక్ ఆనంద్, జాలీ వాకర్ కృష్ణ తదితరులు హాజరయ్యారు.

## జాతీయ స్థాయి దివ్యాంగ క్రికెట్ జట్టు ఎంపిక

**చిక్కడపల్లి ఏప్రిల్ 19 (ప్రభాతవార్త) :** మే 17 నుండి 24 వరకు బెంగళూరు వేదికగా నిర్వహించే జాతీయస్థాయి దివ్యాంగ క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ ఆదివారం జరిగింది. హెచ్ఎంవి క్రికెట్ అకాడమీ వేదికగా ఈ ప్రక్రియను నిర్వాహకులు చేపట్టారు. టోర్నీకి ఎంపికైన క్రీడాకారులకు వారం రోజులపాటు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తారు. ఎంపికైన క్రీడాకారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులకు వారం రోజుల పాటు ప్రత్యేక శిక్షణ శిబిరం (కోచింగ్ క్యాంప్) ఉంటుంది. శిబిరంలో ఆటగాళ్ల నైపుణ్యాలను మెరుగుపరచడంతో పాటు జట్టు సమన్వయంపై దృష్టి సారిస్తారు. అనంతరం జట్టు బెంగళూరుకు బయలుదేరి వెళ్తుంది. దివ్యాంగ క్రికెటర్లలోని ప్రతిభను గుర్తించి, వారికి తగిన గుర్తింపు, వృత్తిపరమైన వేదికను కల్పించడమే ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ జట్లు ఈ టోర్నీలో తలపడనున్నాయి.

## అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

### పద్మారావు

**సైఫాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:**

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహంతో సమానంగా రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌పిఐ, పలు దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. లేని పక్షంలో దళితులంతా ఐక్యంగా ఉద్యమిస్తామని ఆర్‌పిఐ ఉభయ తెలుగురాష్ట్రాల ఇంచార్జి టి.పద్మారావు హెచ్చరించారు. అసెంబ్లీ ప్రాంగణంలో గాంధీ విగ్రహంతో సమానంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులకు, అసెంబ్లీ స్పీకర్‌లు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు.

ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించడం జరిగిందన్నారు. తమ విజ్ఞప్తిపై ప్రభుత్వం చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం జాప్యం చేస్తే దళిత సంఘాలు సహించే స్థితిలో లేవని ఆయన హెచ్చరించారు.

# ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి

### టీజీఎస్‌పీఎఫ్ డీజీపీ స్వాతి లక్రా



మెగా వైద్యశిభిరాన్ని ప్రారంభిస్తున్న టీజీఎస్‌పీఎఫ్‌డీజీపి స్వాతిలక్రా

**బేగంపేట ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** పేదలకు వైద్య సహాయం అందించడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని టీజీఎస్‌పీఎఫ్ డీజీపీ స్వాతి లక్రా అన్నారు. ఆదివారం రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద టీజీఎస్‌పీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మెగా వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాలకు అందిస్తున్న మందులను ఆమె పరిశీలించారు. పేదలు నివసించే బస్తీ గురించి తెల్పుకున్న డీజీపీ నెక్లెస్ రోడ్డు హుస్సేన్‌సాగర్ ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ నగర్ డబుల్ బెడ్ రూం నివాసాల వద్ద ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించి సాధారణ వైద్య పరిక్షలతో పాటు కంటి, పంటి పరిక్షలు, టూడీఎకో, ఈసీజీ, బీపీ, షుగర్ పరిక్షలు చేయించారు. వీటితో పాటు బోన్ డెన్సిటీ పరిక్షలు, పలమనరీ ఫంక్షన్ టెస్ట్ నిర్వహించారు. హృదయానికి సంబంధించిన వైద్యుడు, గైనకాలజిస్ట్, చిన్నారులకు ప్రత్యేకంగా డాక్టర్ ద్వారా వారికి పరీక్షలు నిర్వహింపజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం నివాసాలు హుస్సేన్ సాగర్ వ్యూతో ఎంతో అందంగా ఉన్నాయని, పరిసరాలు వారు అంతా కల్సి వారానికి ఒక రోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, సంపాదన ఎంత ఉన్నా ఆరోగ్యం సరిగా లేకపోతే వృధాయేనని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెగా వైద్యశిబిరానికి వచ్చిన మహిళలు, వృద్ధులను డీజీ ఆప్యాయంగా పలకరించారు. వారందరితో ఫొటోలు దిగుతూ వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ఎన్.త్రినాథ్, అసిస్టెంట్ కమాండెంట్ సన్యాసిరావు, ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది కాలనీ ప్రెసిడెంట్ గణేష్, మాజీ కార్పొరేటర్ కొసికే కిరణ్మయికిషోర్, సతీష్, కిరణ్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఉచిత మెగా వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్నవారికి ఉచితంగా మందులు, పేస్టులు, ఐడ్రాప్స్ పంపిణీ చేసారు.

# వాసవి అమ్మవారికి లక్ష గాజులపూజ



వాసవి అమ్మవారి లక్ష గాజుల పూజలో పాల్గొన్న ఆర్య వైశ్య సంఘం మహిళలు

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** లోక కళ్యాణార్థమై నిర్వహించే శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ మాత లక్ష గాజుల పూజ అత్యంత మహిమాన్విత మైందని ఆర్యవైశ్య సంఘ మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు బెలిదె రమేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ మహిళా విభాగ్ ఆధ్వర్యంలో చింతల్ హెచ్ఎంటి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన లక్ష గాజులపూజా కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘ చింతల్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు జూలూరు విజయ్‌కుమార్ గుప్తాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ మాత లక్ష పూల పూజ, లక్ష గౌరమ్మలతో పూజలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ఆదివారం ఆర్య వైశ్య మహిళావిభాగం ఆధ్వర్యంలో లక్ష గాజులతో అమ్మవారి పూజలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. రెండున్నర దశాబ్దాలకాలంలో మెదటి సారిగా లక్షగాజుల పూజనిర్వహించి నభూతో, న భవిషత్ అనేవిధంగా నిర్వహించడం లోకకళ్యాణానికి, శుభపరిణామాలకు శ్రీకారంచుట్టినట్లవుతుందన్నారు. చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ అంగరంగ వైభవంగా, దేదీప్యమానంగా, శోభాయమానంగా లక్షగాజులతో అమ్మవారిని పూజిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో లక్ష పసుపుకొమ్ములతో పూజలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. లోకమాత, జగన్మాత, వాసవికన్యకాపరమేశ్వరీ మాతను పూజించుకోవటం ద్వారా అమ్మవారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘ కుత్బుల్లాపూర్ మండల అధ్యక్షులు వాస శ్రీనివాస్‌గుప్తా, జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘ ప్రధానకార్యదర్శి తెరాల శ్రీనివాస్‌గుప్తా, శ్రీవాసవి మాత దేవాలయ కమిటీ ప్రతినిధులు రేగోడు ప్రవీణ్‌గుప్తా దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## డిజిటల్ యుగంలో టెక్నాలజీని జాగ్రత్తగా వాడుకోవాలి

### తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్‌పి సాయిశ్రీ

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** నేటి డిజిటల్ యుగంలో టెక్నాలజీని సైబర్ భద్రతా ప్రమాణాలతో జాగ్రత్తగా వాడుకోవాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ ఎస్‌పి (సైబర్ క్రైమ్స్ ఆపరేషన్స్) బి.సాయిశ్రీ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నాదర్‌గుల్‌లోని ప్రముఖ ఎంవిఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమవర్తన్-2026 జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి డిజిటల్ కాలంలో ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్లే సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించే సమయంలో అందరూ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. వ్యక్తిగత సమాచారాన్ని కాపాడుకోవడంతో పాటు బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలని అన్నారు. ముఖ్యంగా అనుమానాస్పద లింక్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ భద్రతా ప్రమాణాలు, సూచనలు పాటిస్తే ఎటువంటి నష్టాలు ఉండవని పేర్కొన్నారు. విజయవంతంగా జరిగిన ఈ ఫెస్ట్‌లో జెపి మోర్గాన్ చేజ్ అండ్ కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సాయికుమార్ ఆతిల్లి, న్యూక్లియస్ విజన్ ఐబీసీ మీడియా అండ్ జింక్ సహ వ్యవస్థాపకుడు అభిషేక్ పిట్టి, మాతృశ్రీ సొసైటీ కోశాధికారి జూపూడి సుధాకర్, ఎంవిఎస్ పవన్‌కుమా

## కాగువాగు భూములను ప్రైవేటుపరం కానీయం: కెఎల్ఆర్

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** నాడు ఇందిరమ్మ పాలనలో పేదలకు ఇచ్చిన నాదర్‌గుల్ కాసువాగు భూములను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు పరం కానీయమని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెసు కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం తుక్కుగూడలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పలువురు రైతులు ఆయనను కలిసారు. ఈ సందర్భంగా వారి సమస్యలు విన్న కెఎల్ఆర్ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నాదర్‌గుల్ కాసువాగు భూములను ప్రభుత్వం తప్పక కాపాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలబడి న్యాయం చేస్తుందని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు

**ఉప్పల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సంరిద్ధి స్కూల్ అఫ్ డాన్స్ గురువు సంగీత చంద్రశేఖర్ శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా రంగపూజ, వినాయక కౌతం, శ్రీవిఘ్న రాజాం భజే, దశావతార శబ్దం, జతిస్వరం, మండూక శబ్దం, నంద నందన తరంగం తదితర అంశాలను కళాకారులు నందిత, ధాత్రి, కైరా, రూప , తేజస్వి, తన్వి, ఆరాధ్య, శ్రీశ్రేష్ఠ, శివణ్య, శాన్వి, రిషిక, ఆర్య తదితరులు ప్రదర్శించి మెప్పించారు.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు



ఉప్పల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నేతలు

## ఉప్పల్‌లో బిజెపి నిరసన

**ఉప్పల్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త :** దేశ ప్రధాని నరేంద్ర మోదీ మహిళల సాధికారత కోసం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టగా, దీనిని అడ్డుకోవడం తగదని పలువురు బిజెపి నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం బిజెపి ఉప్పల్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని ఫణీంద్ర సీనియర్ నాయకులు శామీర్‌పేట్ ధర్మారెడ్డి, యు.బల్వంతచారి, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మద్దెల పద్మ, నామ అనిత, ప్రధాన కార్యదర్శి తీగ విఠల్‌రావు, నామ శ్రవణ్, కోశాధికారి దువ్వాల రమేష్, బిజెపి నాయకులు పంజాల శ్రవణ్‌గౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గుప్త, నర్సిరెడ్డి, బసవరాజు, విజయ్, యువ మోర్చా అధ్యక్షుడు అదేవు రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బాజా జయరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్నేని ఫణీంద్ర మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండియా కూటమి వ్యతిరేకిస్తూ, బిల్లును ఆమోదించకుండా అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ అసలు స్వరూపం బయటపడిందని తెలిపారు. మహిళలపై వారి వైఖరి ఏంటో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు అరుణ్ అభిరామ్, రాజశేఖర్, రవితేజ, రాజేందర్, మహేష్, బాజా సాయిరామ్ పాల్గొన్నారు.

## నేడు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్షికోత్సవాలు

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** చాంద్రాయణగుట్ట కేశవగిరి భ్రమరాంబదేవి సమేత శ్రీచెన్నమల్లిఖార్జున స్వామి దేవస్థానం ఆవరణలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం 5వ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజ, 8.30గంటలకు గణపతి పూజ, పుణ్యహవాచనం, పంచగవ్యారాధన, మండపపూజ, సహస్ర లింగార్చన, ఉదయం 9గంటలకు గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం, అత్యంత శక్తివంతమైన రాజ శ్యామల యాగం, శ్రీ వీరభద్ర మూలమంత్ర హోమం, మూర్తి హోమం, శాంతి హోమం, పాశుపతాది అస్త్రమంత్ర హోమాలు, మహా పూర్ణా హుతి, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ స్వామివారికి స్నపనోత్సవం, విశేష ద్రవ్యాలతో అభిషేకములు (ఏకాదశ రుద్ర వారాభిషేకాలు), అలంకరణ, బహువిధ పుష్పపూజ, నీరాజనం, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 4గంటలకు శ్రీ వీరభద్ర స్వామికి గండదీప సేవ, సాయంత్రం 5గంటలకు శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్ర స్వామి కల్యాణోత్సవం, ప్రస్థయం, నంది కోలసేవ, రాత్రి 8గంటలకు స్వామి అమ్మవార్ల భవ్యమైన పల్లకి సేవ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివార్ల కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు కోరారు.

## నాదర్‌గుల్ కాసువాగు భూములను రైతులకు అప్పగించాలి: సబితాఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** తమది ఇందిరమ్మ రాజ్యమంటూ.. ప్రజాపాలన అంటూ ప్రచారం చేసుకునే సిఎం రేవంత్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆనాడు ఇందిరమ్మ ప్రభుత్వంలో నాదర్‌గుల్ కాసువాగు రైతులకు ఇచ్చిన భూములను వారికే అప్పగించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె స్థానిక రైతులతో కలిసి కాసువాగు భూముల్లో పర్యటించి అక్కడ ఎండిన పంటలను, వ్యవసాయం కోసం వేసుకున్న బోర్లను, నీటి కుంటను పరిశీలించారు. అనంతరం ఆమె రైతులు, మహిళా కర్షకులతో సమావేశమై వారి ఆవేదనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నాటి చంద్రబాబు, వైఎస్ఆర్ పాలనల్లో ఇక్కడి భూములను ప్రభుత్వ భూములుగా ప్రకటించిన సంగతిని గుర్తు చేశారు. దాదాపు 370 ఎకరాల్లో స్థానిక రైతు కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాయనీ అయితే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులను వారు సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్ళనీయకుండా అడ్డుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి భూముల్లో ప్రైవేటు వ్యక్తులు బోర్డులు, రేకులు ఎలా ఏర్పాటు చేస్తారని ఆమె ప్రశ్నించారు. కోర్టులు కూడా ప్రభుత్వ భూములను స్పష్టత ఇచ్చినా రెవెన్యూ మంత్రి సైతం సర్కార్ భూములని పేర్కొంటున్నా రైతులను ఎందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ప్రైవేటు సంస్థల బోర్డులు, రేకులు తొలగించి రైతులు స్వేచ్ఛగా తాము సాగు చేసుకునే భూముల్లోకి వెళ్లే అవకాశం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. వర్షాకాలానికి ముందు భూములను సిద్ధం చేసుకునేందుకు రైతులకు సహకరించాలని ఆమె సూచించారు. ఈ మేరకు ప్రభుత్వం, రెవెన్యూ, పోలీసు శాఖలు చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. లేని పక్షంలో రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని సబితారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న సంఘం నాయకులు

## మాలల జనాభాను తగ్గించి చూపిన ప్రభుత్వం

**సైఫాబాద్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కులగణన సర్వే తప్పుల తడకని, తక్షణమే రీ సర్వే చేయాలని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ తప్పుల తడక జనాభాను ఆధారంగా చేసుకుని ప్రభుత్వం ఏలాంటి నిర్ణయాలను తీసుకోరాదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 246ను ఉల్లంఘిస్తూ, కేంద్ర గణాంకాల చట్టం-1948కి వ్యతిరేకంగా ఏలాంటి చట్టబద్ధత లేని ఈ కుల జనాభాను ఉద్దేశపూర్వకంగా కుట్రలు, కుతంత్రాలతో మాల, మాల అనుబంధ కులాలను తగ్గించి చూపెట్టారని ఆయన ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎసీ వర్గీకరణకై ఏకసభ్య కమిషన్ షమిమ్ అక్తర్ రిపోర్ట్‌లో అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కలు అంటూ మాలల జనాభా 15 లక్షల 27 వేల 143గా చూపడం దారుణమన్నారు. ఊరికి పది కుటుంబాలు లేని రెడ్డి సామాజిక వర్గానికి, మాదిగ సామాజిక వర్గానికి ఎక్కువగా చూపించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇదంతా చూస్తుంటే మాల కులానికి ఏదో ఒక శక్తి పెద్ద ఎత్తున కుట్ర చేస్తున్నట్లుగా తెలుస్తున్నదని ఆరోపించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతినాడు సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరు మా సమిక్షలకు ఊతమిస్తున్నదన్నారు. ప్రసుత్తం పరిస్థితులు చూస్తుంటే రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా కక్షగట్టి మాదిగలతో తిట్టించేందుకే మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతో ఒక సంఘాన్ని పెట్టించినట్లుగా అర్థమవుతున్నదన్నారు. అంబేద్కర్ వారసులైన తెలంగాణ మాలలకు, మాల కులానికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్న గుంట నక్కల భరతం పడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు నిమ్మ బాబురావు, ఉత్తం శ్రీనివాస్, డా.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## చింతల్‌లో చలివేంద్రం ప్రారంభం

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకువచ్చి సమాజసేవలో భాగం పంచుకోవాలని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం చింతల్ మెయిన్‌రోడ్డులో జాలిగం రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వివేకాంద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలో నీటిచుక్క ప్రజలకోసం చేసేసేవ నిజమైన నాయకత్వాన్ని చూపుతుందన్నారు. బిఆర్ఎస్ నాయకులు జాలిగం రాకేశ్ మాట్లాడుతూ వేసవిలో ప్రతిఒక్కరి దాహార్తిని తీర్చాలనే లక్ష్యంగా వేసవి చలివేంద్రాన్ని ప్రారంభించి నిరంతరం కొనసాగేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ కోల, దేవరకొండ శ్రీనివాస్, బోలోజు కిశోర్‌చారి, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బస్సుల్లో వెళ్లే ప్రయాణీకులకు మంచినీటిని అందించారు.

**ప్రకాశంనగర్‌లో...**

**బేగంపేట ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** బేగంపేట ప్రకాశం నగర్ బస్టాప్ వద్ద ఆదివారం చలివేంద్రాన్ని దివంగత మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తనయుడు మర్రి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు షేక్‌గౌస్ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి పేరుతో ప్రతి ఏటా వేసవిలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మర్రి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి మర్రి చెన్నారెడ్డి పేరుతో గౌస్ చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి ప్రజల దాహార్తిని తీర్చడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ ఛైర్మన్ దీపక్‌జాన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

**మల్లాపూర్, బాలాపూర్‌లలో...**

**సరూర్‌నగర్, ఏప్రిల్ 19 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ డివిజన్‌లోని మల్లాపూర్‌లో వైఎఆర్ కన్వెన్షన్ వద్ద అదే విధంగా ఆర్‌సిఐ రోడ్డు శివాజీ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను టిపిసిసి కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మనోహర్, బాల్‌నింగని జంగయ్య, తోట భాను ప్రసాద్, వంగేటి మధుసూదన్‌రెడ్డి, రాజేష్ ఠాకూర్, గుండోజు వెంకటాచారి, బద్ధం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ

**బేగంబజార్, ఏప్రిల్ 19ప్రభాతవార్త:** ఎండ వేడిమి నుంచి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనవసరంగా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్ల వద్దని టిపిసిసి లింగ్విస్టిక్ మైనార్టీసెల్ యూత్ ఛైర్మన్, బాలవీర్ భక్త సమాజ్ అధ్యక్షులు మురళీమోహన్‌సింగ్ సూచించారు. ఈమేరకు చిన్నబజార్‌లోని బాలవీర్ భక్తసమాజ్ దేవాలయం ముందు చిన్నారు లకు, ప్రజలకు ఉచితంగా మజ్జి ప్యాకెట్లను అందచేశారు. కార్యక్రమంలో ప్రతీక్‌శర్మ, సురేందర్, ముబీన్, రవి, రాజు, సాయినాథ్, రమేష్, నితిన్ పాల్గొన్నారు.

## ప్రసూతి వైద్యం, రుమటాలజీ మధ్య సమన్వయం ముఖ్యం

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో క్లినికల్ ఇమ్యునాలజీ రుమటాలజీ విభాగం, ఫెర్నాండెజ్ ఫౌండేషన్ ప్రసూతి విభాగం ఆధ్వర్యంలో మెడికల్ ఒబ్స్ట్రెటిక్ ఇంటర్‌ఫేస్ ఇన్ రుమటాయిడ్ డిసీజెస్ అంశంపై సదస్సును నిర్వహించారు. నిమ్స్ అత్యవసర విభాగభవనంలోని ట్రామా ఆడిటోరియంలో ఈ సదస్సును నిర్వహించారు. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప ముఖ్యఅతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నిపుణులు మాట్లాడుతూ, 20 ఏళ్లకు పైబడిన మహిళల్లో కీళ్ల వాతం సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయన్నారు. ఈ వ్యాధి మాత్రమే కాకుండా, దానికి వాడే కొన్ని ఔషధాల ప్రభావం గర్భధారణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని వివరించారు. అలాగే ప్రసూతి వైద్యం, రుమటాలజీ విభాగాల మధ్య సమన్వయం అత్యంత అవసమని, పరస్పర కమ్యూనికేషన్ లోపం లేకుండా కలిసి పనిచేసినప్పుడే తల్లి ఆరోగ్యం, శిశువు ఫలితాలు మెరుగ్గా ఉంటాయన్నారు. వైద్యులకు అవగాహన పెంపొందించడం, సమగ్ర చికిత్స విధానాలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిమ్స్ రుమటాలజీ విభాగ డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్, ఫెర్నాండేజ్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ డైరక్టర్ డాక్టర్ తారకేశ్వరి పాల్గొన్నారు. ఈ సదస్సులో పలువురు వైద్యులు, నిపుణులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.


**PUBLIC NOTICE**

General Public is hereby informed that my Client **Mr. MIRZA YOUNUS BAIG** S/o MIRZA ABBAS BAIG aged about 50 Years, Occ: Business, Resident of H.No. 9-4-87/A/20, MD. Lines, II Lancer, Golconda, Hyderabad, Telangana- 500008. has entered into an Agreement Of Sale for the purchase of Flat No. 302 on Third Floor in the Apartment known as "SREEKAR APARTMENT" Admeasuring 1010 Sft. MCH No. 9-4-87/A/20/9, Situated at Akbarpua, Mohammedi Line, Tolichowki, Hyderabad, Telangana State. From its Owner Smt. YELLAMAPATI PADMAJA W/o YELLAMPATI BHASKER REDDY, Aged about 45 Years, Occ: Housewife, Resident of Flat No. G-1, Atria-10 Apartment, Road No. 10, Jubilee Hills, Venkatagiri, Road, Hyderabad, T.S., Any Person having any objection over the said property may approach the undersigned within (15) days with all relevant documents from the date of this publication no claim will be entertained, thereafter my client will proceed for registration the above said property.

**M/S HABEEB AHAMED**
**ADVOCATE**
**# 1-116/B, Peerancheru (V), Gandipet (M), Ranga Reddy District, Telangana. Cell No. 9652319905**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE-CUM-VII ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST-CLASS AT MEDCHAL**

**O.S No. 249 of 2026**

**Between:**
Chinta Sadanand and three others ...**Plaintiffs**

**Versus**
The Tahsildar and All Concerned
**To All Concerned ...Defendants**

The above-named plaintiffs have filed the above suit for declaration them as the legal heirs of late Chinta Nirmala before this Hon'ble Court.

Please take notice that the above suit is posted on 04-05-2026 at 10:30 A.M., before this Hon'ble Court for your appearance along with your written statement, failing which the matter will be heard and decided according to law

**By Order of the Court**

Sd/-
**S. Kamalakar,**
Advocate
Plot No. 37,
First Floor, Green Park,
Suchitra, Hyderabad-500067

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE-CUM- VIII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS; MEDCHAL-MALKAJGIRI DIST AT: MEDCHAL.**

**O.S. No. 170 OF 2026**

BETWEEN
**Narsangari Vijaya Laxmi & 3 others .....Plaintiffs**
AND
**The Tahasildar, Bachupally Mandal & another ...Defendants**
To,
**All concerned,**

Please take notice that my clients Narsangari Vijaya Laxmi & 3 others filed above suit O.S. No.170/2026 on the file of the Hon'ble I Addl Junior Civil Judge-Cum-VIII Addl. Judicial Magistrate of First Class; M.M.Dist At: Medchal for Declaration of Legal Heirs of Late Sri Narsangari Krishna against all concerned. The above suit is posted for your appearance before the said court on **22-04-2026 at 10.30 am** either in person or through an advocate or else the matter will be decided exparte.

BY ORDER OF THE COURT

**Sd/- V. ARUNA**
**Advocate**
O/c. Plot No.15,
New Greencity Colony, Budwel,
Rajendra Nagar, Hyderabad-30
**Counsel for the Plaintiffs**
**Ph.No.9666569530**


స్లాబు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

## ఇందిరమ్మ ఇళ్ల స్లాబు పనులు ప్రారంభం

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 19,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామానికి చెందిన బొమ్మగళ్ల దివ్య వెంకటేష్ ఇళ్ల స్లాబు పనులను షాద్‌నగర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పిట్ట రజిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు మేలు చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, చెన్నిగారి నర్సింలు, కృష్ణయ్య, నర్సింలు, బొమ్మగల శ్రీను, బొమ్మగాళ్ల రమేష్ ,వెంకటేష్, బొమ్మగాళ్ల నర్సింలు, రమేష్, నర్సింలు, కావాలి రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అయ్యప్ప ప్రసాదం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు.

## అయ్యప్ప ఆశీస్సులు అందరిపై ఉండాలి

ఎమ్మెల్యేకు అయ్యప్ప ప్రసాదం అందజేసిన కాంగ్రెస్ నేతలు

**నందిగామ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** లోక కళ్యాణం కోసం అవతరించిన హరిహర పుత్రుడు అయ్యప్ప ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షి ంచారు. నందిగామ మండలం బండోని గూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత పసుల బుచ్చయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు జాలగూడెం రాజు లు శబరిమల అయ్యప్ప దైవదర్శనం అనంతరం ఆదివారం ఎమ్మెల్యేకు అయ్యప్ప ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తిమార్గం ద్వారానే ముక్తి మార్గం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని కోరారు.

## అంబేద్కర్ నగర్‌లో వృద్ధుడు అదృశ్యం

మిస్సింగ్ కేసు నమోదు



**జవహర్ నగర్, ఏప్రిల్ 19,ప్రభాత వార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి నగర్, అంబేద్కర్ నగర్‌కు చెందిన వారంది గౌరమ్మ వయస్సు 56 తన భర్త పాండు వయస్సు 66 తో కలిసి అంబేద్కర్ నగర్‌లో నివసిస్తున్నారు. గౌరమ్మ సమీపంలోని రోజ్ ఫ్లవర్ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న బేకరిలో పని చేస్తుండగా, పాండు చిన్న చిన్న పనులు చేస్తూ ఇంట్లోనే ఉంటున్నారు. గౌరమ్మ పనికి వెళ్లగా, ఆ సమ యంలో పాండు ఇంట్లో ఒక్కడే ఉన్నారు. పని ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చిన గౌరమ్మకు తన భర్త కనిపించలేదు. వెంటనే తన కుమారుడు సాయి కిరణ్‌కు సమాచారం ఇవ్వగా,అతనికీ సమాచారం లేదని తెలిపాడు. వెంటనే కాలనీ పరిసరాలు, బంధువుల వద్ద వెతికినా పాండు ఆచూకీ లభించలేదు.ఆయన మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది.దీనితో గౌరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉచిత ఖత్నా క్యాంపు విజయవంతం


ఉచిత ఖత్నా శిబిరంలో చిన్నారులకు శస్త్రస చికిత్సలు చేస్తున్న వైద్యులు

**కొడంగల్,ఏప్రిల్ 19,ప్రభాతవార్త:** కొడంగల్ పట్టణంలోని షాబజారులో ఖమర్ మంజిల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత ఖత్నా క్యాంపు విజయవంతమైనట్లు మైనార్టీ నాయకులు ఎస్.ఎం.గౌసన్ తెలిపారు.శిబిరంలో కొడంగల్ నియోజకవర్గంలోని 41 మంది చిన్నారులకు వైద్యులు శస్త్ర చికిత్సలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొహమ్మద్ యూసుఫ్,నయూం,ఇంతియాజ్,మొహమ్మద్ సలీం,మునీర్, అసీఫ్‌ఖాన్,అబ్దుల్ కరీం,షేక్ ఆదిల్,వాహెద్,రహీం,మొహమ్మద్ సిరాజుద్దిన్,ముర్షద్,ముశ్రాఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 24న ఛలో ఫతేపూర్ గోడపత్రిక ఆవిష్కరణ

**శంకర్‌పల్లి ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ వార్డ్ లో ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం ఏప్రిల్ 24న నిర్వహించబోయే మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ చలో ఫతేపూర్ గోడపత్రిక కార్యక్రమం ఆవిష్కరించడం జరిగింది. రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలంలోని ఫతేపూర్ గ్రామంలో ఏప్రిల్ 24 శుక్రవారం రోజున సాయంత్రం 4 గంటలకు అంబేద్కర్ యువజన సంఘము ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమనికి తెలంగాణ రాష్ట్ర శాసన సభపతి గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేనా బీమ్ భరత్, మాజీ గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మనగారి వెంకటరెడ్డి అతిథులుగా విచేయుచున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మండల నాయకులు, అంబేద్కర్ సంఘ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## ఉద్యోగినుల వసతి గృహం స్థల మార్పుపై కలకలం

**జవహర్ నగర్,ఏప్రిల్ 19, ప్రభాత వార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జీహెచ్ఎంసి పరిధిలోని జవహర్ నగర్‌లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ స్థల కేటాయింపు విషయంలో పలునాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఈ హాస్టల్ నిర్మాణానికి సర్వే నెంబర్ 647లో భూమి కేటాయించగా, తాజాగా ఆ కేటాయింపును సర్వే నెంబర్ 646కు మార్చడం వివాదానికి దారితీసింది.ఈ స్థల మార్పుపై స్థానిక ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పారదర్శకత లేకుండా తీసుకున్న ఈ నిర్ణయంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులపై ఆరోపణలు చేస్తున్నారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, ఏవైనా అవినీతి లేదా అవకతవకలు జరిగి ఉంటే వాటిని బహిర్గతం చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్పష్టమైన వివరణ ఇవ్వాలని అధికారులను కోరుతున్నారు.ఇదిలా ఉండగా, ఈ వివాదంపై అధికారుల స్పందన కోసం స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# క్రీడలతోనే ఆరోగ్యం..ఆనందం

**నందిగామ, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** క్రీడలతో దేహధారుడ్యంతో పాటు మానసిక ఆనందం పెంపొందుతుందని నందిగామ ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం నందిగామ మండలం పిట్టలగూడెం గ్రామానికి చెందిన వార్డు సభ్యులు గంగిశెట్టి సరిత మురళి ఆధ్వర్యంలో పిపిఎల్ 9 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మాజీ ఎంపిటిసి దేపల్లె కుమార్ గౌడ్, షాద్ నగర్ మార్కెట్ డైరెక్టర్ సి నర్సింలు, వార్డు సభ్యులు బొమ్మగళ్ళ నర్సింలు ,అగ్గి సూరి, చించేటి శివ,జి శ్రీశైలం,నాయకులు శ్రీకాంత్,రఘు,పవన్,మల్లేష్, రవి,యువ నాయకుడు కొమ్ము సాయి ,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


పిట్టలగూడెంలో బిపిఎల్ 9 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఉపసర్పంచ్.

## వెంకటాద్రి టౌన్‌షిప్‌లో ఎస్‌వైఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చౌదరిగూడ వెంకటాద్రీ టౌన్‌షిప్‌లో ఎస్‌వైఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, ట్రస్టు ప్రధాన కార్యదర్శి సందీప్‌రెడ్డి తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19, ప్రభాత వార్త:** మండు వేసవిలో దాహార్తులకు దప్పిక తీర్చడమే లక్ష్యంగా ఎస్‌వైఆర్ ట్రస్టు పనిచేయడం హర్షించదగ్గ విషయమని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. పోచారం డివిజన్ చౌదరిగూడ వెంకటాద్రీ టౌన్‌షిప్‌లో ఆదివారం ఎస్‌వైఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎస్‌వైఆర్ ట్రస్టు ఈ ప్రాంత ప్రజలకు పలు విధాలుగా సేవలు అందించడం మంచి పరిణామమని అన్నారు. ట్రస్టు చైర్మన్ సామల యాదిరెడ్డి, బిఆర్ఎస్ యువ నాయకుడు ట్రస్టు ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, మాజీ కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, మెట్టు బాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఒరుగంటి వెంకటేశ్ గౌడ్, వంగూరి శివశంకర్, నాయకులు సామల బుచ్చిరెడ్డి, అబ్బువతి నర్సింహ, మాజీ వార్డు సభ్యులు మంద స్వామిదాస్, శేఖర్‌రెడ్డి, దుర్గారాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దు

**పరిగి,ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రైతులు కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు.

అదివారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో స్థానిక నాయకులతో కలిసి మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దిగుబడి నాణ్యతను పరిశీలించారు.మద్దతు ధరతోనే రైతులకు మేలు జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పరుశరాంరెడ్డి,ఆత్మ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రజిత వెంకటేష్, పార్టీ అధ్యక్షులు కృష్ణ, జిల్లా డిసిఎంఎస్ అధికారి వెంకటరమణా రెడ్డి,మార్కెట్ కమిటివైస్ చైర్మన్ అయూబ్,మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

# సర్దార్ పాపన్న బహుజన నాయకుడు

నేటి సమాజం ఆదర్శంగా ఆయనను తీసుకోవాలి

**తలకొండపల్లి ఏప్రిల్ 19 , ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాన్ని ఏలిన సర్దార్ పాపన్న గౌడ్ బహుజన నాయకుడని అతన్ని ఆదర్శంగా నేటి సమాజం అతన్ని ఆదర్శంగా నేటి సమాజం తీసుకోవాలని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్, మాజీ మిషన్ భగీరథ రాష్ట్ర వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ లు ముఖ్యఅతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ హైదరాబాద్ సమీపంలోని గోల్కొండ రాజులను ఎదిరించి దళిత బహుజన రాజ్యాన్ని స్థాపించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఆయన అడుగుజాడలో నేటి సమాజం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు. అంతకుముందు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామని, అతని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు అనంతరం అతని విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు టి ఆచారి, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీసీఎల్ శ్రీనివాస్ యాదవ్, సదానందం గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు బాల కుమార్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్, కృష్ణ గౌడ్, మాజీ ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్, మాజీ సర్పంచ్ లు లలిత జోతయ్య, రమేష్ యాదవ్, రవి గౌడు తో పటాయ గ్రామాల గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన గ్రామ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం

**ధారూర్, ఏప్రిల్ 19, ప్రభాత వార్త:** వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష ్యంగా క్షేత్రస్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు, ధారూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో నూతన గ్రామ కమిటీల ఏర్పాటుకు నాయకులు శ్రీకారం చుట్టారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం ప్రధాన కార్యదర్శి చామల రఘుపతి రెడ్డి, డిసిసి వికారాబాద్ జనరల్ కార్యదర్శి బాబా ఖాన్, ధారూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్ సింగ్, మాజీ జడ్పీటీసీ కుక్కింద రాములు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ జైదుపల్లి హన్మంతు రెడ్డిల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది.ఆదివారం మండల పరిధిలోని గడ్డమీదిగంగారం, నాగసముందర్, అల్లాపూర్, రుద్రారం, గట్టెపల్లి, రాంపూర్ తాండ గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పార్టీ అభివృద్ధికి తోడ్పడే నిజమైన కార్యకర్తలను గుర్తించి కమిటీల్లో అవకాశం కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లోని ప్రతి కార్యకర్త అభిప్రాయాన్ని గౌరవిస్తూ, అందరి ఏకాభిప్రాయంతో యాక్టివ్‌గా పనిచేసే వారినే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పార్టీ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బుజ్జయ్య గౌడ్, వికారాబాద్ నియోజకవర్గ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి సిద్దునూరి యాదగిరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రమేష్ కృష్ణ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గఫార్, ప్రకాశ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

## ఉన్నత శిఖరాలకు చేరాలంటే విద్య ద్వారానే సాధ్యం

**కేశంపేట, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలంటే అది కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుందని తొమ్మిది రేకుల సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన విద్యార్థినిలు ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. మారుమూల గ్రామ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన రాఘపురం సుజాత, సుభాన్ రెడ్డి దంపతుల కూతురు వరలక్షి ్మ 465 మార్కులు సాధించగా, గుత్తి పద్మ, పాండు దంపతుల కూతురు శ్రీవాణి 463 మార్కులు సాధించి గ్రామానికి గౌరవం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత కరుణాకర్ రెడ్డి దంపతులు విద్యార్థినులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఇలాంటి ప్రతిభను ప్రోత్సహిస్తూ ఖమ్మంకు చెందిన ప్రముఖ వ్యక్తి కె. రవికుమార్ ఒక్కొక్క విద్యార్థినికి రూ.5,000 వేల రూపాయల చొప్పున నగదు బహుమతిని అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఉదితవత్ రవి నాయక్, వార్డు సభ్యులు పోగుల నర్సింలు, నరేష్, కందెన సంతోష, ప్రేమలత, యాదయ్య, మాజీ ఎంపీటీసీ రంగయ్య, చిట్టి రెడ్డి వెంకట్ రెడ్డి, రాఘవాచారి, గుత్తి శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, నిరంజన్, సంజీవరెడ్డి, నరసింహ రెడ్డి, కొమురె మల్లేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి తెలంగాణ ఏర్పాటును అడుగడుగునా అడ్డుకుంది

**షాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** బీజేపీ ప్రభుత్వం రాజకీయ కుట్రతోనే మహిళా బిల్లుకు లింక్ పెట్టి డిలీమిటేషన్ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిందని టిపిసిసి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అశ్వక్ అలీ ఆరోపించారు. మహిళా బిల్లును ప్రత్యేకంగా ప్రవేశ పెడితే ఏకగ్రీవంగా ఆమోదించబడేదని తెలిపారు. మహిళా బిల్లు పాస్ కావాలని బీజేపీ ఎంత మాత్రం లేదని స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం, దక్షి ణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గించడం కోసమే డిలీమిటేషన్ బిల్లు తీసుకువచ్చిందని ఆరోపించారు.


అశ్వక్ అలీ

డిలీమిటేషన్ ద్వారా దక్షి ణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బీజేపీ నాయకులు అడుగడుగునా అవమానిస్తున్నారని, తెలంగాణ ప్రజల పోరాటాన్ని కించపరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన రోజును బ్లాక్ డే అని, ఇండియా పాకిస్తాన్ ను విడగొట్టినట్టు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ లను విడగొట్టారనే దుర్మార్గపు మాటలతో తెలంగాణపై విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. తెలంగాణ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు కాస్తంతా కూడా సిగ్గులేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం గడిచిన 12ఏళ్లలో తెలంగాణకు అదనంగా ఒక్క రూపాయి ఇవ్వలేదని, ఒక్క ప్రాజెక్టు కేటాయించలేదని అన్నారు. బీజేపీ ప్రతిదీ రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప మహిళలు, పేద ప్రజల అభివృద్ధి కోసం కాదని తెలియజేసినారు.

రైతులను అన్ని రకాలుగా

## దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**తలకొండపల్లి ,ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను అన్ని రకాలుగా దగా, మోసానికి గురిచేస్తుందని, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల ఆదివారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలో పరిధిలో రైతుల పంటలను కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల్ వెంకటేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న వేసుకున్న రైతులతో వారు ముచ్చటించారు. ఈ సందర్భంగా రైతుబంధు వస్తుందా అని ? కరెంటు ఏ విధంగా ఉందని? రైతులని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కెసిఆర్ హయాంలో రైతులు సుభిక్షంగా ఉండేవారని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలకు చేతలకు పొంతన లేకుండా ఉందని, ఏ గ్రామంలో 100 రుణమాఫీ జరగలేదని, అరకు ర నిధులతో రైతుబంధు వేశారని ఆయన విమర్శించారు. రైతుల మేలు కోసం కరెంటు కెసిఆర్ ఆయంలో 24 గంటలు ఉచిత కరెంటు అందజేశామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల కేవలం ఆరు ఏడు గంటలు మాత్రమే కరెంటుఇస్తున్నట్లు ఆయన తెలిపారు. గత రెండున్నర సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కటి సాధించకపోగా రాష్ట్ర ప్రజలను అన్ని రకాలుగా దగా చేశారని, ప్రతి ఒక్కరు మల్లి కేసిఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. రాష్ట్రంలోని ప్రజలందరికి వృత్తుల వారిగా సబ్సిడీలు అందజేసిన ప్రస్తుతం ఏ ఒక్కటి అమలు కావడం లేదని, గతంలో భూముల ధరలకు రెక్కలు వచ్చేవని ప్రస్తుతం భూములు కొనేవారు లేరని ఆయన అన్నారు.

ఇప్పటికైన ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని,ఆయన డిమాండు చేశారు.ఈ కార్యక్రమములో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,మాజీ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మెన్ ఉప్పల వెంకటేష్,మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,తలకొండపల్లి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,మాజీ సర్పంచ్ జ్యోతయ్య,నరసింహ,తటితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్ సీజ్

..ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్


సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

**పెద్దేముల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి ఒకరిపై కేసునమోదు చేసిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోచోటుచేసుకుంది. ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం..ఆదివారం తెల్లవారు జామున పెద్దేముల్ ఎస్ఐ, పోలీస్ సిబ్బందితో చైతన్యనగర్ గ్రామశివారులో బీట్ డ్యూటి నిర్వహిస్తుండగా, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నందుకు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు రైతు నేస్తం

..మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్

**పెద్దేముల్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** ఈ నెల 20న (నేడు) మండలంలోని పెద్దేముల్, మంబాపూర్, తట్టెపల్లి రైతు వేదికలలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ ప్రీతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో సాయిల్ హెల్త్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమం, అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు అవగాహన, సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా 2వ విడత రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుందని అన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి


సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**కుల్కచర్ల,ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి జరుతున్నాయని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. అదివారం మండల కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండ్ అవరణలో స్థానిక నాయకులతో కలిసి సిసి రోడ్డును రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..గత బిఆర్ఎస్ ప్రభుత్వానికి ధనిక రాష్ట్రాన్ని అప్పులకుంపటిలోకి నెట్టారని, పది సంవత్సరాల పాలనలో ఒక్క రేషన్ కార్డు, ఇండ్లు లేని పేదలకు ఇల్లు ఇవ్వలేదని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంత్సరాల పాలనో రైతులకు 2 లక్షల రుణ మాఫీ, సాగు నీటి కాల్వల అభివృద్ధి, రేషన్ కార్డు,ఇందిరమ్మ ఇండ్లు, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం, పంపిణీ,మహిళలకు ఉచిత బస్సు పథకాలు ప్రవేశ పెట్టి అమలుచేస్తుందని అన్నారు. పరిగి నియోజక వర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలోడిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి,మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు పాంబండ ఆలయ చైర్మన్ మహిపాల్ రెడ్డి,ఆయా గ్రామా సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన భర్త అదృశ్యం

**జవహర్ నగర్, ఏప్రిల్ 19. ప్రభాతవార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ,భరత్ నగర్ జమ్మిగడ్డకు చెందిన రేవు శివాని వయస్సు 23 తన భర్త రామస్వామితో కలిసి నివసిస్తోంది. వీరిద్దరూ మూడు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుని, ప్రస్తుతం రెండేళ్ల పాపకు తల్లిదండ్రులుగా ఉన్నారు. రామస్వామి వయస్సు 26 తన భార్య శివానితో గొడవపడి ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. అనంతరం అతను ఇంటికి తిరిగి రాకపోవడంతో, శివాని అతని మొబైల్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది.



దీంతో శివాని తన భర్త కోసం బంధువుల ఇళ్లలో మరియు పరిచయస్తుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.శివాని ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఇస్నాపురం మాణిక్యంగౌడ్

**పూడూరు, ఏప్రిల్ 19, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శిగా పూడూరు మండలం చెన్‌గోముల్ గ్రామానికి చెందిన ఇస్నాపురం మాణిక్యంగౌడ్ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తారాసింగ్ చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా మాణిక్యంగౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంఉంచి జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పిసిసి అధ్యక్షుడు మహేష్‌గౌడ్,వికారాబాద్ జిల్లా డిసిసి అధ్యక్షుడు దారాసింగ్,స్థానిక ఎమ్మెల్యే,మాజీ డిసిసి అధ్యక్షలు టి రాంమోహన్ రెడ్డి,పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వివరించారు.రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రతిఇంటికి తీసుకువెళ్లి జిల్లాలోకాంగ్రెస్‌పార్టీ భలోపేతానికి నిర్విరామంగా కృషిచేస్తానని తెలియజేశారు.మండలంలోని అన్నిగ్రామాల్లో అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎం భగవాన్‌దాసు,మాజీ ఉప సర్పంచ్ జె లింగప్ప,మండల కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు రామస్వామి,కె సుధాకర్‌గౌడ్,వి యాదగిరిగౌడ్, నవీన్‌కుమార్,సుధాకర్,శంకర్,బి నర్సింలు,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు దారాసింగ్‌నుండి నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న ఇస్నాపురం మాణిక్యంగౌడ్ తదితరులు

## అరుణ్ గురుస్వామికి శేషాచార్య అవార్డు-2026 ప్రదానం

**జవహర్ నగర్, ఏప్రిల్ 19,ప్రభాత వార్త:** ధర్మ ప్రచారం మరియు ఆచరణలో అంకితభావంతో సేవలందిస్తున్న అరుణ్ గురుస్వామికి 2026 సంవత్సరానికి గాను శేషాచార్య అవార్డు ప్రదానం చేయడం శుభపరిణామమని కాప్రా మండలం సాయి నగర్ సాయి మాల అయ్యప్ప దేవస్థానం చైర్మన్ రేగళ్ల సతీష్ రెడ్డి తెలిపారు.ఆదివారం కౌకూర్‌లోని శ్రీ శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య మఠంలో ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.



ఈ సందర్భంగా రేగళ్ల సతీష్ రెడ్డి అరుణ్ గురుస్వామిని పాదాభివందనం చేసి ఆయన సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో బాలానగర్ అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ ఘనసాల జంగయ్య, ఫతేనగర్‌కు చెందిన శ్రీ రమణ గురుస్వామి, కేరళ గాన కోకిల రాజు గురుస్వామి, గంగాధర్ గురుస్వామి, శ్రీకాంత్ స్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే అయ్యప్ప మాల ధారణ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.